పులకించిన తుంగా తీరం



- వైభవంగా రాఘవేంద్రుడి మహా రథోత్సవం
- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనవాహిని
- రథంపై నుంచి పీఠాధిపతి దివ్య సందేశం



మహా రథోత్సవం ముందు బందోబస్తులో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు

దివ్యాంగ భక్తురాలిని ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తుంగాతీరం ఆధ్యాత్మిక పరవశ్లతో భక్తులు పరవశించిపోయారు. గుండెల నిండా భక్తి నింపుకుని దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు 'మూలరామా విజయథే.. తుంగా తీరా నివాసా గోవిందా గోవిందా.. జయహో గురు రాఘవేంద్ర విజయహో.. పూజ్యాయ రాఘవేంద్రాయ నమో నమః' అంటూ లక్షలాది మంది భక్తులు పులకించిపోయారు. రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో ఐదో రోజు అత్యంత ప్రాముఖ్యమైన ఉత్తారాధనలో భాగంగా మంగళవారం మహా రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూల బృందావనానికి విశేష పూజలు చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. వజ్ర వైడూర్య రత్నాలతో పొదిగిన హారం, బంగారు ఆభరణాలతో అలంకృతుడైన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను సంస్కృత పాఠశాల వరకు ఊరేగించి తిరిగి శ్రీమఠానికి తీసుకువచ్చారు. రంగులు చల్లుతూ వసంతోత్సవంలో భాగంగా మఠం అర్చకులు, మఠం సిబ్బంది భక్తులపై రంగులు చల్లుతూ ఉల్లాసంగా, ఉత్సాహంతో ముందుకు సాగారు. శ్రీమఠం మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్ భక్తులతో కిక్కిరిసింది. కళాకారుల ప్రదర్శనల నడుమ రథోత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ రథోత్సవంలో రాజా ఎస్.గిరిరాజాచార్, మఠం దివాన్ సుజీంద్రాచార్, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఏఈలు బద్రినాథ్, శ్రీహరి, వ్యాసరాజాచార్, బిందు మాధవ్, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, రవి కులకర్ణి, జేపీ స్వామి, విజయేంద్రాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ ఆచార్, జయతీర్థాచార్, వాదిరాజాచార్‌లు పాల్గొన్నారు.

విశ్వవ్యాప్తికి హిందూధర్మం

- సందేశమిచ్చిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



పహల్గామ్‌లో ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను హతమార్చిన ఘటనపై ప్రతి ఒక్కరూ ఖండించి సనాతన హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తికి ముందుకు తీసుకెళ్లాలని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. మంగళవారం మహా రథంపై నుంచి భక్తులకు అభివాదం చేస్తూ, సంస్కృతం, కన్నడ, తెలుగు, తమిళం, హిందీ ఐదు భాషల్లో మహారథంపై నుంచి దివ్య సందేశాన్ని ఇచ్చారు. దేశ అభివృద్ధి, భద్రత, శాంతిని నెలకొల్పేందుకు అందరూ సహకారం అందించాలన్నారు. దుష్ట శక్తులు, దేశ ద్రోహులు, శాంతికి ద్రోహం తలపెడితే సహించరాని నేరం అన్నారు. కుల, మత భేదం లేకుండా అందరికీ వరాలిచ్చే రాఘవేంద్రస్వామి సజీవంగా యోగ శక్తిలో భక్తుల కష్టాలు తీర్చి వరాలు ప్రసాదించే రాఘవేంద్రులు కృప ఉంటుందన్నారు. పుష్కరిణి, తూర్పు, దక్షిణ వైభాగంలో స్వర్ణకవచం బృందావనం స్తంభాలకు బంగారు కవచాలను ఏర్పాటు చేశామన్నారు. ఈఏడాది కొత్తగా 700 మందికి వసతి కల్పించామన్నారు. శ్రీమఠం ఉద్యోగులకు వేతనాలు పెంచుతామని, సిబ్బందికి హెల్త్ బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచ శాంతి కోసం మూలరాములు, రాఘవేంద్రస్వామికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు.



రంగులు చల్లి వసంతోత్సవం చేస్తున్న పీఠాధిపతి



ఉడిపి కళాకారులు



ఉత్సవాల్లో ఎస్పీ విక్రాంత్ పాటిల్



వాయిద్యాలు మోగిస్తున్న కళాకారులు



నృత్యం చేస్తున్న యువకులు



రథోత్సవంలో పాల్గొన్న నాయకులు



కళాకారులు చేస్తున్న నృత్యం

ఉరుకుంద స్వామి హుండీ లెక్కింపు

- ఆరు రోజుల ఆదాయం రూ.1.33 కోట్లు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం హుండీని మంగళవారం లెక్కించినట్లు డిప్యూటీ కమిషనర్(డీసీ) వాణి తెలిపారు. శ్రావణమాసం సందర్భంగా ఆరు రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను దేవస్థానపు కాలక్షేప మండపంలో లెక్కించగా నగదు రూపంలో రూ.1,33,56,261, బంగారం మూడు గ్రాములు, వెండి 32కిలోల 700 గ్రాములు వచ్చినట్లు డీసీ తెలిపారు. ఆరు రోజుల్లోనే ఇంత ఆదాయం హుండీ ద్వారా రావడం ఇదే మొదటిసారి అన్నారు. కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్, ఆదోని గ్రూపు ఆలయ పర్యవేక్షులు, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయ ఉప ప్రధాన అర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజు స్వామి, శివన్న స్వామి, బ్యాంకు సిబ్బంది, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వండి

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ఆదోని, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాల అనుమతుల విషయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించి అభివృద్ధికి సహకరించాలని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో కుడా ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో పాటు సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తేనే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలన్నారు. మౌలిక వసతులను మెరుగుపరచడం, అక్రమ నిర్మాణాలను అరికట్టడం, పచ్చదనం పెంపు వంటి అంశాల్లో చురుకైన పాత్ర వహించాలని ఆయన కోరారు. నాన్ లేఅవుట్లను అరికట్టి ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నాన్ లేఅవుట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ తిమ్మక్క, ప్లానింగ్ ఆఫీసర్లు విజయభాస్కర్, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమే : కలెక్టర్



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం, రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక బి.క్యాంపులో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికల్లో పౌష్టికాహార లోపం రక్తహీనతకు కారణమయ్యే నులి పురుగులను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శాంతికళ, డీఈవో శామ్యూల్‌పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

- జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీడీవోలకు మంగళవారం జడ్పీ ఆవరణలోని జిల్లా వనరుల శిక్షణ కేంద్రంలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ తీసుకున్న వారందరు ఆయా మండలాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీపీవో భాస్కర్, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ మంజులవాణి, శిక్షణ మేనేజర్ గిడ్డేష్, టీఓటీలు ఎస్.అస్రఫ్ బాషా, జగన్నాథం, కే.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం రిజిస్ట్రార్‌గా రాజ్‌కుమార్



కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం రిజిస్ట్రార్‌గా రాజ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాజ్‌కుమార్ 26 సంవత్సరాలుగా దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ విభాగాల్లో పని చేశారు. విభిన్న విద్యాప్రమాణాలు కలిగిన రాజ్‌కుమార్ ఐసీడబ్ల్యూఏ ఇంటర్ అర్హతతో పాటు వాణిజ్యం, ఆర్థికం, ఆర్థిక శాస్త్రంలో డిగ్రీ పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐఐ టీడీఎం కర్నూలు సమాజం తనను స్వాగతించిందని, విద్య, పరిశోధన ఆవిష్కరణలో సంస్థ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో తన వంతు కృషి చేస్తానని వివరించారు.

ప్రైవేటు పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు : డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌టీఈ చట్టం కింద జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ జారీచేసినట్లు డీఈవో శామ్యూల్ పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25వ తేదీ వరకు అవకాశం కల్పించామన్నారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నివాసం నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలు మాత్రమే ప్రవేశాలు ఉంటాయన్నారు. దరఖాస్తును పరిశీలించి ఈ నెల 21న విద్యార్థుల అర్హతలతో 25వ తేదీన లాటరీ ద్వారా ఫలితాలు ప్రకటిస్తామన్నారు. లాటరీ ద్వారా ఎంపికైన వారికి 31న పాఠశాలలో అడ్మిషన్లు ఖరారు చేస్తారన్నారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ కొనసాగింపుగా ఈ అదనపు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డీఈఓ తెలిపారు.

మరో ముగ్గురు! 7

- ఉమ్మడి జిల్లాలో టీడీపీ నేతలకు నామినేటెడ్ పదవులు
- ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆకెపోగు ప్రభాకర్
- 'విశ్వబ్రాహ్మణ'కు కె.పార్వతమ్మ, 'బొందిలి' చైర్మన్‌గా విక్రమ్

శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళల భద్రత కోసం శక్తి యాప్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 14,137 మంది మహిళలు శక్తి యాప్‌ను తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా డయల్ 112 ఎస్‌వోఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళలకు పోలీసులు అత్యవసర సహాయం అందించేందుకు శక్తి యాప్ పని చేస్తుందన్నారు. శక్తి యాప్ 799348511ను మహిళలు కాల్ చేసినా మెసేజ్ చేసినా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సంకేతాలు వెళ్లిన వెంటనే శక్తి టీం స్పందిస్తారన్నారు. జిల్లాలో శక్తి టీమ్‌లను ప్రత్యేంగా ఏర్పాటు చేశామని, శక్తి టీమ్‌లు జిల్లాలో జిల్లా హెడ్ క్వార్టర్ టీమ్‌తో సహా కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్లలో మొత్తం 5 శక్తి టీమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో టీమ్‌లో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులతో కలిసి మొత్తం ఆరుగురు పోలీసులు ఉంటారన్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిని గుర్తించి చర్యలు తీసుకోవడం కోసం ప్రత్యేక హాట్ స్పాట్‌లను గుర్తించి అక్కడ ఈ టీములు పని చేస్తుంటాయనీ తెలిపారు. పాఠశాలలో, ఇంటర్ కాలేజీలో చదివే విద్యార్థులకు ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు, ప్రేమ మోసాలు, సోషల్ మీడియా ప్రభావం, సైబర్ క్రైం, విద్యా ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగురవేయాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- నగరంలో 1.1 కిలో మీటర్ల పొడవు తిరంగా ప్రదర్శన

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసఫ్ కళాశాల నుంచి కొండారెడ్డి బురుజు వరకు 2800 మంది విద్యార్థులతో 1.1 కిలోమీటర్ల పొడవుగల మువ్వన్నెల జెండా ప్రదర్శనను కలెక్టర్ ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 'హర్‌ఘర్ తిరంగా' ప్రదర్శనలో భాగంగా నిర్వాహకులు గ్లోబల్ టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ ఖాజా మాలిక్, సెయింట్ జోసెఫ్ కళాశాల సహకారంతో 1.1 కిలోమీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించారు. ఇది ఇండియాలో వరల్డ్ రికార్డు స్థానం సంపాదించుకుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రికార్డు చేసేందుకు వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఇండియాకు చెందిన ప్రతినిధులు వచ్చారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్‌పాల్, గ్లోబల్ టౌన్‌షిప్ మేనేజర్ ఖాజా మాలిక్, పవన్ సోలంకి, సెయింట్ జోసెఫ్ కళాశాల డీన్ శౌరీల రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హ్యాపీ టోల్‌గేట్!



- పంద్రాగస్టు నుంచి ఫాస్టాగ్ వార్షిక పాస్
- వాహనదారులకు భారీ ఊరట
- జాతీయ రహదారుల టోల్ ఫీజు నిబంధనలకు సవరణ
- రూ.3వేలతో గరిష్ఠంగా 200 ట్రిప్పులు

ఓర్వకల్లు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇకపై వాహనదారులు నెలకు టోల్‌చార్జీల రూపంలో వేలకు వేల రూపాయలు వదిలించుకోవాల్సిన పనిలేదు. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్రం భారీ ఉపశమనం కలిగించింది. ఒకసారి రూ.3వేలు కడితే చాలు దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న టోల్‌గేట్ల మీదుగా గరిష్ఠంగా 200 సార్లు ప్రయాణించే అవకాశం కల్పించింది. 'వార్షిక పాస్' పేరుతో ఈ పథకాన్ని ఫాస్టాగ్ యూజర్ల కోసం ఆగస్టు 15వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా అమలులోకి రానుంది. టోల్ ప్లాజా విధానం ద్వారా ప్రయాణీకులకు ఎంతో మేలు జరగనుంది. రూ.3వేల చెల్లింపుతో ప్రత్యేక టోల్ పాస్‌ను ఎవరైనా వ్యక్తిగత వాహనదారులు పొందవచ్చు. ఒక సంవత్సరం లేదా 200 టోల్ ప్రయాణాల వరకు వర్తిస్తుంది. కావాలనుకున్న వాహనదారులు మాత్రమే వార్షిక పాస్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15నుంచి ఈ ఫాస్టాస్ ఆఫర్ అందుబాటులోకి రానుంది. టోల్‌ప్లాజాను దాటిన ప్రతిసారి ఒక ట్రిప్పుగా లెక్క గడుతారు. మనం ప్రయాణంలో నాలుగు టోల్ ప్లాజాలు దాటితే.. నాలుగు ట్రిప్పులు పూర్తయినట్లు లెక్కిస్తారు. ఈ లెక్కన వార్షిక ఫాస్టాగ్ అనేది 200 సార్లు మాత్రమే పని చేస్తుంది. మొత్తం పూర్తి కాకపోతే ఏడాదంతా ఈపాస్ పనిచేస్తుంది. ఈ రెండింటిలో ఏదీ ముందుగా ముగిస్తే దానిని ఫాస్టాంగ్‌కు తుది గడువుగా పరిగణిస్తారు. ఫాస్టాగ్ వ్యక్తిగత వాహనదారులు మాత్రమే వర్తిస్తుంది. వాణిజ్య(కమర్షియల్) వాహనాలు, టాక్సీలకు వర్తించదు. అలాగే ఒక వాహనానికి జారీ చేసిన పాస్‌ను మరో వాహనానికి బదిలీ చేయడం కూడా వీలుకాదు. వాహన రిజిస్ట్రేషన్ నంబరు (వీఆర్ఎన్)తో రిజిస్ట్రేషన్ చేసిన ఫాస్టాగ్‌పై మాత్రమే ఈ పాస్ వర్తిస్తుంది. చాసిస్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేసిన ఫాస్టాగ్‌లకు వర్తించదు. టోల్ ఫీజు ఎంత ఉన్నా నిబంధనలు లేకుండా టోల్ ప్లాజా దాటవచ్చు. ఈ వార్షిక పాస్‌ను టోల్‌ప్లాజాలో లేదా ఆన్‌లైన్‌లో పొందవచ్చు.





దరఖాస్తు ఇలా..

- రాజ్‌మార్గ్ యాత్ర మొబైల్ యాప్ అధికారిక వెబ్‌సైట్లు www.nhai.gov.in, www.morth nic.in సందర్శించాలి.
- వాహన రిజిస్ట్రేషన్ నెంబర్ ఫాస్టాగ్ ఖాతా వివరాలతో లాగిన్ కావాలి.
- రూ.3వేల ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలి. (యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయి)
- చెల్లింపు విజయవంతమైతే, పాస్ మీ ప్రస్తుత ఫాస్టాగ్ ఖాతాకి లింక్ అవుతుంది.
- డిజిటల్ రసీదును కూడా వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- పాస్ చెల్లుబాటు ఆగస్టు 15 నుంచి ప్రారంభమవుతుంది.

వాహనదారులకు గుడ్‌న్యూస్




వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ ఇచ్చింది. ఇక టోల్‌చార్జ్ రూ.15కే ఆగస్టు 15 నుంచి అమలు కానుంది. దేశంలో వాహనదారులకు శుభవార్త చెప్పింది. కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరి జూన్ 18వ తేదీన కీలక ప్రకటన చేశారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ ద్వారా నిర్వహిస్తున్న కర్నూలు నుంచి కడప వరకు 40వ జాతీయ రహదారిలో ప్రయాణించే వేల మంది ప్రయాణీకులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ మార్గాన్ని వినియోగించే విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. కేంద్రం తీసుకువచ్చిన నిర్ణయం డిజిటల్ ఇండియా స్మార్ట్ మౌలిక సదుపాయాల లక్ష్యానికి అనుగుణంగా ఉంటుంది.

● వి.మదనమోహన్, ప్రాజెక్టు హెడ్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్, కర్నూలు

'స్త్రీశక్తి'కి సర్వం సిద్ధం

- పంద్రాగస్టు నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం
- జోన్-4 పరిధిలో 3,223 బస్సులు
- ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



నంద్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూపర్-6 హామీల్లో భాగంగా ఆగస్టు15వ తేదీ నుంచి 'స్త్రీ శక్తి పథకం' పేరుతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత ప్రయాణం సదుపాయం కల్పిస్తోంది. ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం వెసులుబాటు కల్పించారు. అందుకు అనుగుణంగా జోన్-4 పరిధిలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల ఆర్టీసీ డిపోల్లో 4,401 బస్సులు ఉండగా.. 3,236 బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని కడప జోన్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు వెల్లడించారు. ఇదే క్రమంలో ఉచిత ప్రయాణంతో పెరిగే రద్దీ నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆ దిశగా సిబ్బంది శిక్షణ నిర్వహించి ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం చేశామన్నారు. నంద్యాల జిల్లా ఆర్టీసీ డిపో పర్యటనకు వచ్చిన ఆయనతో ఆంధ్రజ్యోతితో ప్రత్యేక ఇంటర్వ్యూ.

● జోన్-4 పరిధిలో ఉచిత ప్రయాణానికి ఎన్ని బస్సులు కేటాయించారు?

కడప జోన్-4 పరిధిలో కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాలు కలవు. ఇందులో 52 డిపోలు ఉండగా.. ప్రస్తుతం 4,401 బస్సులు నడుస్తున్నాయి. ఇందులో 3,236 బస్సుల్లో ఉచిత ప్రయాణం అవకాశం కల్పించాం. ఎక్కడైనా అవసరమైతే మరీ పెంచుతాం.

● ఏయే బస్సుల్లో ఉచిత ప్రయాణం?

ఐదు రకాల బస్సుల్లో ప్రభుత్వం ఉచిత ప్రయాణం సదుపాయం కల్పించింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చు. అయితే నాన్ స్టాప్, అంతర్రాష్ట్ర కాంట్రాక్టు క్యారేజ్, ప్యాకేజీ, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సదుపాయం లేదు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలి.

● నాలుగు ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి రోజూవారి ఆదాయం ఎంత?

ప్రస్తుతం అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల పరిధిలో 4,401 బస్సులు ప్రతి రోజు 11.19లక్షల కిలోమీటర్లు ప్రయాణం సాగుతోంది. ఇందులో 15.09 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుండగా.. వీరిలో 40శాతం మహిళా ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి రోజు ఆర్టీసీకి నాలుగు ఉమ్మడి జిల్లా పరంగా రూ.6.20 కోట్ల ఆదాయం వస్తోంది.

● స్త్రీ శక్తి పథకంతో ఆర్టీసీ ఆదాయం తగ్గుతుంది కదా?

స్త్రీశక్తి పథకం అమలైతే ప్రస్తుతం ఉన్న రోజు వారి మహిళా ప్రయాణికులకంటే రెట్టింపు స్థాయిలో పెరిగే అవకాశం ఉంది. ఆర్టీసీ కోట్ల రూపాయల మేర ఆదాయం తగ్గుతుంది. కానీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు ఉచిత ప్రయాణానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం ఆర్టీసీకి జమ చేస్తుంది.

● ఏ జిల్లాల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది?

స్త్రీ శక్తి పథకం అమలుతో జోన్-4 పరిధిలోని తిరుపతి, నంద్యాల, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలో మహిళా ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. ఆయా జిల్లాల్లో పుణ్యక్షేత్రాలు ఎక్కువగా ఉండటంతో మహిళల ప్రయాణం ఎక్కువగా సాగే అవకాశం ఉంది. ప్రధానంగా తిరుపతి, శ్రీశైలానికి ఎక్కువగా మహిళా ప్రయాణికులు వెళ్లే అవకాశం ఉంది.

● కొత్తగా సిబ్బందిని నియమించారా?

కడప జోన్-4 పరిధిలోని ఉమ్మడి జిల్లాల్లోని ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లను ఆన్‌కాల్ వారీగా తీసుకున్నాం. తీసుకున్న సిబ్బందికి కలిపి విడతల వారిగా సమగ్రంగా శిక్షణ కల్పించి అప్రమత్తం చేశాం. ఉచిత ప్రయాణంలో ప్రయాణికులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా చూసుకుంటారు.

● ఉచిత ప్రయాణంతో బస్టాండ్లలో పెరిగే రద్దీపై చర్యలు తీసుకున్నారా?

స్త్రీ శక్తి పథకం అమలు నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ ఖచ్చితంగా పెరుగుతుంది. కావున నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని ఆర్టీసీ బస్టాండుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం. ఆదిశగా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రధానంగా మరుగుదొడ్లు, తాగునీటి, కుర్చీలు, ఫ్యాన్లు తదితర వసతులు కల్పించాం. విచారణ కౌంటర్ వద్ద సమస్యలు తలెత్తకుండా నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకున్నాం.

● ఉచితంగా ఎంతవరకు ప్రయాణం చేయవచ్చు?

ఉచిత ప్రయాణం రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా చేయవచ్చు. ప్రభుత్వం అందించిన ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు తదితర గుర్తింపు కార్డు కలిగి ఉంటే బస్సులో ఉచితప్రయాణం ఉంటుంది. ఇతర రాష్ట్ర మహిళలకు ఉచిత ప్రయాణం ఉండదు.

ఆదర్శ పాఠశాల తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జేడీ దేవసాగర్

మహానంది, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను మంగళవారం జేడీ దేవసాగర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి భగవాన్‌దాస్, ఎంపీహెచ్‌ఈవో ఉసేనొరెడ్డి, పీహెచ్ఎన్ అమీనాబీ, ఎంపీహెచ్ఎస్ నరసింహరావు, ఏఎన్ఎం దుర్గాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మహానందీశ్వరుని సన్నిధిలో అటవీశాఖ ఫీల్డ్ డైరెక్టర్



ఆశీర్వాదం పొందుతున్న కాశీవిశ్వనాథరాజు

మహానంది, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మంగళవారం అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మంటపం వద్ద ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకాభిషేకార్చన పూజలు చేశారు. కల్యాణమంటపంలో ఆయనున్న వేదపండితులు శాలువాతో సన్మానించి, ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి ప్రసాదాలు అందచేసారు. డీఆర్వో హైమవతి, రామకృష్ణ, ఎఫ్‌బీఓలు రాణాప్రతాప్ ఉన్నారు.

భూపనపాడుకు కలెక్టర్ రాజకుమారి

పాణ్యం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదికలో వచ్చిన ఓఅర్జీపై కలెక్టర్ రాజకుమారి స్పందించారు. సమస్యను తెలుసుకునేందుకు నేరుగా గ్రామానికి వెళ్లి పరిశీలించారు. పాణ్యం మండలంలోని భూపనపాడు డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఇటీవల కలెక్టర్‌కు ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఆమె భూపనపాడులో పర్యటించారు. గ్రామంలోని బీసీ కాలనీలో రహదారులు, డ్రైనేజీ సమస్యలపై ప్రజలతో మాట్లాడారు. డ్రైనేజీ పూర్తిగా దెబ్బతిని మురుగునీరు రోడ్లపైకి వస్తోందని ప్రజలు తెలిపారు. రహదారులు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేయించాలని కలెక్టర్‌ను కోరారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలకుండా ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏఈ మహబూబ్‌బాషా, సర్పంచ్ జనార్దన్ ఉన్నారు.

కుడి ఎడమైతే పొరపాటులేదోయ్..

- లెఫ్ట్ హ్యాండర్స్‌కు సమాజంలో ప్రత్యేక గుర్తింపు
- నేడు అంతర్జాతీయ లెఫ్ట్ హ్యాండర్స్ డే



ఆత్మకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్.. ఓడిపోలేదోయ్.. అంటూ అలనాటి ప్రముఖ సంగీత విద్వాంసులు ఘంటసాల ఎన్టీఆర్ నటించిన దేవదాస్ చిత్రంలో ఆలపించిన గాత్రం అందరికి ఇప్పటికీ గుర్తు ఉండేపోతోంది. కుడి, ఎడమలన్నీ మానవదేహంలో సమానమేనన్న భావనను ఆయన తన గాత్రంతో స్వరపరిచారు. మంచి మనసుతో చేసే ప్రతి కార్యం పవిత్రమైనదేనని దీనికి కుడి, ఎడమలేవి అతీతం కావని స్పష్టం చేస్తున్నారు. ఎడమ చేతివాటం వారు ప్రపంచవ్యాప్తంగా రాజకీయాల్లో, క్రీడల్లో, కళాకారుల్లో, సంగీత విద్వాంసులలో మరెన్నో ఇతర రంగాల్లో రాణించిన దృష్టాంతాలు ఉన్నాయి. వీరి ప్రతిభను గుర్తిస్తూ ప్రతిఏటా ఆగస్టు 13న అంతర్జాతీయ లెఫ్ట్ హ్యాండర్స్ డేగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఎలా ఆరంభమైందంటే..

1990లో తొలుత యునైటెడ్ కింగ్‌డమ్‌లోనే ఎడమచేతి వాడకస్తుల క్లబ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఎడమచేతివాటం కలిగినవారు వాడే వస్తువులు తయారీలో ఈ క్లబ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. క్రమక్రమంగా ప్రపంచవ్యాప్తంగా లెఫ్ట్‌హ్యాండర్స్ క్లబ్ బలోపేతమై పలుదేశాల్లో ఆసంఘం కేంద్రాలు ఏర్పాటయ్యాయి. మొట్టమొదటి సారిగా 1992 ఆగస్టు 13వ తేదీన అంతర్జాతీయ లెఫ్ట్ హ్యాండర్స్ డేను జరుపుకోవడం ఆరంభించింది. అప్పటినుంచి ప్రతిఏటా ఇంటర్నేషనల్ లెఫ్ట్ హ్యాండర్స్ డేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 10శాతం మంది ఎడమచేతి వాటం వాళ్లు ఉన్నట్లు ఓ అంతర్జాతీయ సర్వే ద్వారా తెలుస్తోంది.

భారత్‌లో పేరుగాంచిన లెఫ్ట్ హ్యాండర్స్ వీరే

భారత్‌లో వివిధ రంగాల్లో ఎంతో మంది ప్రముఖులు ఎడమచేతి వాటం కలిగి ఉన్నారు. మాజీ ప్రధానీ మన్మోహన్‌సింగ్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఎన్సీపీ నేత శరత్ పవార్, మాజీ కేంద్ర మంత్రి పీ.చిదంబరం, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు ఏఆర్. రహిమాన్, అమిత్ త్రివేది, ఆదిత్య నారాయణ, అర్షద్‌వారసీ, రతన్‌టాటా, సుధామూర్తి, విక్రమ్‌సారాబాయి, కిరణ్‌మజుందార్‌షా, సౌరవ్‌గంగూలీ, యువరాజ్, గౌతమ్‌గంబీర్, ఇర్ఫాన్ పఠాన్, రవీంద్ర జడేజా, ఆశీస్ నెహ్రా, సురేష్ రైనా, రోహిత్ శర్మ, హార్థిక్ పాండ్యా, సైనా నెహ్వాల్, అమితాబ్‌బచ్చన్, అనుష్కశర్మ, కంగనా రనౌత్ ఎంతో మంది ప్రముఖులు వివిధ రంగాల్లో ఉన్నారు.

ఆనందంగా ఉంది



ఎడమ చేతివాటాన్ని కలిగి వున్న తమ లాంటి వారికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక రోజును కేటాయించడం ఆనందంగా ఉంది. ఎడమ చేతివాటానికి అలవాటు పడటం మంచిదో.. లేదో తెలియదు కాని తమ చేతిరాతకు ప్రత్యేక గుర్తింపు వుండటం సంతోషంగా భావిస్తున్నాను.

● మోహన్‌సింగ్, ఉపాధ్యాయుడు, ఆత్మకూరు


ఎడమ చేతివాటం అలవాటైంది



బాల్యం నుంచే ఎడమచేతి వాటానికి అలవాటు పడ్డాను. చిన్నతనం నుంచే తనకు ఈ రకమైన ప్రత్యేకత రావడం ఆనందంగా ఉంది. లెఫ్ట్ హ్యాండర్స్ డే రోజునే నా బర్త్‌డే కూడా ఉండటం మరో ప్రత్యేకంగా భావిస్తున్నా.

- తేజ, ఇంటర్ విద్యార్థి, తోటగేరి, ఆత్మకూరు

15న 'సైసైరా నరసింహారెడ్డి' నాటక ప్రదర్శన



కర్నూలు కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన 'సైసైరా నరసింహారెడ్డి' చారిత్రక నాటకాన్ని ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. టీజీవీ కళాక్షేత్రంలో ఆగస్టు 15న సాయంత్రం 6:30 గంటలకు ఈ నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ప్రముఖ నంది అవార్డు గ్రహీత, దివంగత పల్లేటి లక్ష్మీకులశేఖర్ రాసిన ఈ నాటకానికి కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య దర్శకత్వం వహిస్తున్నారు. గతంలోనూ నంది నాటక పోటీల్లో ఉత్తమ నంది బహుమతులు సాధించిన ఈ నాటకంలో టీవీ, సినీనటి సురభి ప్రభావతి, హసీనా, జీవీ శ్రీనివాసరెడ్డి, కె.బాలవెంకటేశ్వర్లు, వి. రాముడు, పి.రాజారత్నం, చల్లా నవీన్‌కుమార్ చౌదరి, పి.భాస్కర్, ఎస్.మహమ్మద్ మియా, గాండ్ల లక్ష్మయ్య వివిధ పాత్రలు ధరించినట్లు నాటక కన్వీనర్ కేవీ రమణ తెలిపారు. చారిత్రక గుర్తింపు పొందిన ఈ నాటకాన్ని ప్రేక్షకులంతా ఉచితంగా తిలకించవచ్చని కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, కోశాధికారి కె.రామస్వామి తెలిపారు.

డీ.ఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీ-ఫార్మసీ రెండు సంవత్సరాల గల కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ, రెగ్యులర్ లేదా ఓపెన్ స్కూల్ ద్వారా పాసైన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పత్రాలను బి.తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఫార్మసీ విభాగంలో ఈ నెల 19లోపు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9441825230, 9666217061 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అవయవదానం.. మరొకరిలో జీవించే వరం

మరణంలో జననం.. చావు అనివార్యమై అచేతనావస్థలో ఉన్నా మరొకరి ప్రాణాలు నిలబెట్టగలిగితే.. అంతకన్నా గొప్ప విషయమేముంది.. అవయవ దానం అలాంటి సదావకాశాన్నే కల్పిస్తుంది. చనిపోయినా మరొకరిలో జీవించే వరాన్ని ప్రసాదిస్తుంది. అవయవాలు విఫలమై ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న దశలో ఉన్న మరొకరికి పునర్జన్మను ఇస్తుంది. మరణం నుంచి జననంలోకి అడుగేస్తుంది. ఇది ఎప్పటి నుంచో అందుబాటులో ఉన్నా చాలా మందికి దీని గురించి తెలియడం లేదు. సరైన అవగాహన లేకపోవడంతో ఎంతో మంది ముందుకు రావడం లేదు. అవయవ దానంపై అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 13న ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

- అవయవదాతలుగా నమోదు కోసం 'జీవన్‌ధాన్' వెబ్‌సైట్
- సజీవదానంలో కిడ్నీ, కాలేయం, రక్తదానం వంటివి
- జీవన్మృతి దానంలో గుండె, ఊపిరితిత్తులు, పాంక్రియాస్
- ఒకరి నుంచి ఎనిమిది మందికి జీవనం
- ప్రపంచ అవయవ దాన దినోత్సవం



కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అవయవదానంతో మరొకరిలో జీవించే వరం దక్కుతుంది. అవయవాలు విఫలమై ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న దశలో ఉన్న మరొకరికి పునర్జన్మను ఇస్తుంది. మరణం నుంచి జననంలోకి అడుగేస్తుంది. రాష్ట్రంలో ww-w.jeevandan.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేయవచ్చు. గత ఏడాది రాష్ట్రంలో సుమారు 40వేల మంది డయాలసిస్‌పై రోగులు ఉన్నారు. దురదృష్టవశాత్తు వారిలో 50 శాతం మంది ఒక సంవత్సరంలో మృతి చెందగా కేవలం 2,500 మందికి కిడ్నీ మార్పిడి జరిగింది. కిడ్నీ కోసం వెయిటింగ్‌లో ఉండగా కేవలం 500 మంది కెడవరిక్ మార్పిడి శస్త్ర చికిత్సలు మాత్రమే జరిగాయి.

అవయవదానం రకాలు..

అవయవదానం రెండు రకాలు. ఒకటి లైవ్(సజీవ) దానం.. బతికున్నవారు అవయవాన్ని లేదా అవయవ భాగాన్ని దానం చేయడం. కిడ్నీ, కాలేయం, రక్తదానం వంటివి ఇలాంటివే. మనం ఒక కిడ్నీ ఉన్నా జీవించొచ్చు. కొంత భాగాన్ని దానం చేసిన కాలేయం తిరిగి వృద్ధి చెందుతుంది.

● రెండోవది కెడావర్ (జీవన్మృతి) దానం అంటే మరణించి బ్రెయిన్ డెడ్ తర్వాత అవయవాలను దానం చేయడం. దీనికి స్థిరపడిన వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మరణించిన తర్వాత వారి సన్నిహిత కుటుంబ సభ్యులైన దానం చేయడానికి అంగీకరించొచ్చు. అవయవదాతలు ఎలా చనిపోయారన్నదీ కీలకమే. బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, కాలేయం, పాంక్రియాస్, పేగుల వంటి కీలక అవయవాలను గ్రహించవచ్చు. ఒకవేళ సహజ మరణం అయితే కంటి కార్నియా, చర్మం, ఎముక, గుండె కవటాలు రక్తనాళాలు వంటి కణజాలాల దానానికి మాత్రమే వీలుంటుంది.

బ్రెయిన్ డెడ్ అయిన

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు, కాలేయం, క్లోమం కంటి కార్నియా పేగులు ఇలా అవయవాలను సేకరించవచ్చు. అంటే ఒకరు బ్రెయిన్ డెడ్ అయితే ఎనిమిది మందికి ప్రాణం పోయవచ్చు. సేకరించిన అవయవాలను నిజంగా అవసరమైన వారికి 10, 15 సంవత్సరాల పాటు జీవించే అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో మూడు హాస్పిటల్స్‌కు అనుమతి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో జీవన్‌ధాన్ ట్రస్టు కింద మూడు హాస్పిటల్స్‌కు రిజిస్ట్రేషన్, అవయవదాన మార్పిడికి గుర్తింపు ఇచ్చింది. ఇందులో కర్నూలు జీజీహెచ్, కిమ్స్, మెడికవర్ హాస్పిటల్స్ ఉన్నాయి. కర్నూలు జీజీహెచ్‌లో 2017లో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అనుమతి లభించింది. కిమ్స్ హాస్పిటల్‌కు జీవన్‌ధాన్ ట్రస్టు 2021 జూన్ 30వ తేదీ గుర్తింపు ఇచ్చింది.

కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జీజీహెచ్‌లోనే



కర్నూలు జీజీహెచ్‌కు జీవన్‌ధాన్ కింద కిడ్నీ, లంగ్స్, హార్ట్ అవయవాల సేకరణ మార్పిడి చేయడానికి అనుమతి ఉంది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించిన తర్వాతనే అవయవాలను సేకరిస్తాం. రాష్ట్రంలోనే కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు ఒక కర్నూలు జీజీహెచ్‌లోనే నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో నాలుగు వేల మంది కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు.

- డాక్టర్ కే.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్,జీజీహెచ్, కర్నూలు

కిమ్స్ హాస్పిటల్‌లో జీవన్‌ధాన్





కిమ్స్ హాస్పిటల్‌లో ఇప్పటి వరకు జీవన్‌ధాన్ కింద 64 కిడ్నీ మార్పిడి, లివర్ మార్పిడి 51 ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించాం. ప్రతి సంవత్సరం దేశంలో 1.8 లక్షల మంది రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందుతున్నారు. వీరు అవయవదానం చేస్తే వేలాది మంది ప్రాణాలను కాపాడొచ్చు.

- డా.కే.అనంతరావు, నెఫ్రాలజిస్టు అండ్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

కలాం.. సలాం

- ఉత్తమ పాఠశాలగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్
- వరుసగా నాలుగోసారి ఎంపిక
- 2025 'పది' ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అగ్రభాగం
- స్వాతంత్ర్య వేడుకల్లో అందుకోనున్న అవార్డు



డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డా.ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు అరుదైన గౌరవం దక్కింది. 2024-25 విద్యాసంవత్సరానికి గానూ 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే (మున్సిపల్ యజమాన్యం విభాగంలో) అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించినందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసింది. ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవంలో భాగంగా అమరావతిలో రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ పాఠశాల అవార్డును పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందుకోనున్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడం ఇది వరుసగా నాలుగో సారి. దీంతో ఈ పాఠశాలకు ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. కర్నూలు నగరంలో 2016 సంవత్సరంలో ఈపాఠశాలను ఫౌండేషన్ పాఠశాలగా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నెల కొల్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫౌండేషన్ పాఠశాలను రద్దు చేశారు. అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాలాజీ చొరవతో ఫౌండేషన్ స్కూల్‌గా పేరు మార్చి డా.ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలగా మార్చి రికగ్నైజ్‌డ్ తీసుకు వచ్చారు. 2022 సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 40మంది పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థిని డెబ్బోరా మిజ్బోర్ 592/600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అగ్రభాగంలో నిలిచారు. 2023లో జరిగిన ఎస్ఎస్‌సీ పరీక్షలో 54 మందికి గానూ 53 మంది పాసై వంద శాతం సాధించారు. సుస్మిత్ అనే విద్యార్థిని 586/600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. 2024 విద్యాసంవత్సరం పరీక్ష ఫలితాల్లో 48మంది హాజరై అందరూ పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. డి.ఇక్బాల్ అను విద్యార్థి 593/600 మార్కులు సాధించారు.

అందరూ పాసై..

2025 విద్యాసంవత్సరంలో 43 మంది పరీక్షకు హాజరు కాగా, అందరూ పాసై వంద శాతం సాధించారు. సాయిలిఖిత అనే విద్యార్థిని 597/600 మార్కులతో రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ పాఠశాలలో చదివిన 206మంది విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక య్యారు. 54 మంది విద్యార్థులు ఇడుపులపాయ, నూజివీడు వంటి ట్రిపుల్ ఐటీలకు ఎంపికై ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. 2022 బ్యాచ్‌కు చెందిన రాగిమాన్ ఈశ్వర్ అనే విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధిచి కర్నూలు ఐఐటీ డీఎంకు ఎంపికై బీటెక్ ద్వితీయ సంవత్సరంలో సీఎస్ఈ బ్రాంచ్‌లో చదువుతున్నారు. పాఠశాలకు సొంత భవనం లేదు. మున్సిపల్ పాఠశాలల్లోని భవన సముదాయంలోనే కొనసాగుతుండటంతో ఇబ్బందిగా ఉంది

అవార్డు రావడంపై హర్షం



వరుసగా నాలుగోసారి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలకు తమ పాఠశాల ఎంపిక కావడంపై హర్షం వ్యక్తంచేశారు. ఇదంతా గతంలో పనిచేసిన ఉపాధ్యాయుల సమష్టి కృషిగానే భావిస్తున్నాం. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది కూడా రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలగా రాణించేందుకు తమవంతు కృషిచేస్తాం.

● వి.మహేష్, ఇన్‌చార్జి హెచ్ఎం

ఇక్కడ చదివినందుకు గర్వపడుతున్నా



ఈ పాఠశాలలో చదివినందుకు గర్వపడుతున్నా. వరుసగా నాలుగుసార్లు ఉత్తమ పాఠశాలగా ఎంపిక అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుల కృషి, పట్టుదలకు నిదర్శనం. ఇక్కడే చదివి పదో తరగతిలో 562/600 మార్కులుతో పాసయ్యా. ఇంటర్‌లో 908/1000 మార్కులు సాధించా. జేఈఈ-మెయిన్స్‌లో ర్యాంకు తో కర్నూలు ఐఐటీ డీఎంలో బీటెక్ సీఎస్ఈ బ్రాంచ్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. **- రాగిమాను ఈశ్వర్, పూర్వ విద్యార్థి**

అక్రమ కేసు బనాయించడం దుర్మార్గం



బాధితుడు రమేష్ ఒంటిపై లాఠీదెబ్బలు

ఆదోని, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన దళిత రమేష్‌పై వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ అక్రమ కేసు బనాయించడం దుర్మార్గమని మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు గోపాల్, మాల మహానాడు నాయకుడు జైభీమ్ సాయిరాం, పీఓడబ్ల్యూ నాయకురాలు సుజ్ఞానమ్మ అన్నారు. మంగళవారం బాధితుడు రమేష్‌తో కలిసి ప్రజా సంఘాల సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 30వ తేదీన ప్రభాకర్ టాకీస్ వద్ద ఉన్న రమేష్‌ను సీఐ శ్రీరామ్, కానిస్టేబుళ్లు జీపులో కంట్రోల్ రూమ్‌కు తీసుకెళ్లి బండ బూతులు తిట్టి లాఠీతో చితకబాదారన్నారు. బంగారు బజారులో తన స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని గోడ కట్టగా దానిపై రమేష్ కోర్టులో కేసు వేశాడన్నారు. దీనిపై రమేష్ పంచాయితీకి ఒప్పుకోలేదన్న అక్కసుతో పోలీసులు చిత్రహింసలకు గురిచేసి తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. సీఐ, కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- బైక్‌ను ఢీకొట్టిన ట్రాలీ ఆటో

బనగానపల్లె, ఆగస్టు 12, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామ క్రాస్‌రోడ్డు సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. వివరాలు.. బేతంచెర్ల పట్టణానికి చెందిన మధు పెద్దకుమారుడు చరణ్(19) బైక్‌పై ఊరుఊరు తిరుగుతూ మిక్సీలు, గ్యాస్ స్టౌలు రిపేరీ చేసేవాడు. మంగళవారం ఉదయం పలుకూరులో మిక్సీలు, గ్యాస్ స్టౌలు రిపేరుచేసి స్వగ్రామానికి వెళ్తున్నాడు. బేతంచెర్లకు చెందిన మనీ అయ్యర్ అనే వ్యక్తి ట్రాలీ ఆటో అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ తోడేళ్లగుట్ల వద్ద బైక్‌ను ఢీకొట్టాడు. చరణ్ తలకు, రెండు చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. చరణ్ మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం తరలించారు. మృతుడి తండ్రి మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి

- రూ లక్ష నష్టం



ధ్వంసమైన మెక్కజొన్న పంట

మహానంది, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటపై సోమవారం అర్ధరాత్రి అడవి పందులు దాడి చేశాయి. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన రైతు కొండబోయిన వెంకటరమణ తన రెండెకరాల్లో మొక్కజొన్న సాగుచేశాడు. గ్రామ శివారులో ప్రాంతంలో రైతు సాగుచేసిన పంటపై అడవి పందులు దాడిచేసి పూర్తిగా ధ్వంసం చేశాయి. రూ.లక్ష మేర పంట నష్టం జరిగిందని బాధిత రైతు పేర్కొన్నాడు. అటవీశాఖ అధికారులు పరిశీలించి దెబ్బతిన్న పంటకు పరిహారం అందించాలని రైతు కోరాడు.

జూడో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

- నంద్యాల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం



మూడో స్థానం సాధించిన జూడో జట్టు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడో చాంపియన్ షిప్ పోటీల్లో నంద్యాల జిల్లా జట్టు మూడో స్థానం సాధించినట్లు జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన ఈ పోటీల్లో నంద్యాల జిల్లా క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచారు. నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత ప్రథమంగా జూడో క్రీడలో పతకం సాధించడం విశేషమన్నారు. ప్రతిభ కనబరచిన జిల్లా క్రీడాకారులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు పతకాలు సాధించి రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. జిల్లా జూడో సంఘం కార్యదర్శి శాంత రాజు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలి

- 22 ఏళ్ల యువకుడికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్
- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు



కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న రోగితో సూపరింటెండెంట్, వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని, మరణం అనంతరం 6, 7 మందికి ప్రాణదానం చేయవచ్చని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన చాంబరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన 22 ఏళ్ల గుర్రం గిరిధర్‌కు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను నెఫ్రాలజీ, యురాలజీ వైద్యులు విజయవంతంగా నిర్వహించారన్నారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం కొత్తబనకచర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జూలై 9వ తేదీ కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో చేరగా 16వ తేదీన బ్రెయిన్ డెడ్ అయ్యాడని వివరించారు. బ్రెయిన్ డెడ్ అయిన రోగికి జీవన్‌ధాన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న దేవనకొండ మండలం కరివేములకి చెందిన 22 ఏళ్ల గుర్రం గిరిధర్‌కు అదే నెల కర్నూలు జీజీహెచ్‌లో అడ్మిషన్ చేయించుకుని 17వ తేదీ కిడ్నీ మార్పిడిని వైద్యులు నిర్వహించారు. యురాలజీ హెచ్‌వోడీ డా.ముత్యాశ్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బాలరవితేజ, నెఫ్రాలజీ హెచ్‌వోడీ డా.అనంతరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.వెంకట పక్కిరెడ్డి, డా.శ్రీధర్‌శర్మ అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాల ఆధ్వర్యంలో ఆపరేషన్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనా సుపత్రుల్లోనే మొట్టమొదటిసారిగా కర్నూలు జీజీహెచ్‌లో ఐదు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించారని, వైద్యారోగ్య శాఖ మంత్రి నుంచి ప్రశంసలు అందినట్లు ఆయన తెలిపారు. నెఫ్రాలజీ సీనియర్ వైద్య నిపుణురాలు డా.పిఎస్ జిక్కి, అనస్థీషియా ప్రొఫెసర్ డారామశివ నాయక్, సీఎస్ఆర్ఎంవో టీసీహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా అభివృద్ధి

- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి
- పాలకమండలి సమావేశంలో కీలక తీర్మానాలు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వాణిజ్య బ్యాంకులకు దీటుగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ప్రగతి పథంలో నడపాలని కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ బి.విష్ణువర్ధన్ రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్యాంకు అభివృద్ధి, రైతులకు ప్రయోజనాలు అందించే పలు నిర్ణయాలను తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రజలతో పాటు రైతుల సౌకర్యార్థం బంగారు ఆభరణాలపై వడ్డీ రేటు 9.2 శాతం నుంచి 9.10 శాతానికి తగ్గించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సహకార బ్యాంకు సేవలను ప్రజలకు, రైతులకు మరింత దగ్గర చేసేందుకు కర్నూలు జిల్లాలో ఏడు నూతనశాఖలను ఏర్పాటు చేసేందుకు పాలకవర్గం ఆమోదించింది. గోనెగండ్ల, మద్దికెర, మామిదాలపాడు, వెల్దుర్తి, సీ.బెళగల్, కౌతాళం, కోసిగి కేంద్రాల్లో ఈ నూతన శాఖలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు ఆర్బీఐకి నివేదికలు పంపించాలని చైర్మన్ ఆదేశించారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని రైతులకు అవసరమైన ఎరువుల వ్యాపారం చేసేందుకు ఒక్కో సంఘానికి రూ.25 లక్షల చొప్పున బ్యాంకు గ్యారెంటీ మంజూరు చేసేందుకు పాలకవర్గం నిర్ణయించింది. మామిదాలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి చెందిన మునగాలపాడులో ఉన్న పాత గోదాము పునర్నిర్మాణానికి రూ.17.66 లక్షలను మొదటి విడతగా మంజూరు చేస్తూ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో రామాంజనేయులు, నాబార్డు ఏజీఎం డీడీ సుబ్బారెడ్డి, జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ, ఆప్కాబ్ డీజీఎం దినేష్ కుమార్, డీజీఎంలు ఉమామహేశ్వర రెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఏజీఎం త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు నియామక పత్రాలు

ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఇటీవల పరీక్షలు రాసి ఎంపికైన 37 మందికి డీసీసీబీ చైర్మన్ నియామక పత్రాలు అందించారు. బ్యాంకు అభివృద్ధి, ప్రజలు, రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు.

కాన్పు కోసం వస్తే కాటికి పంపారు

- సిజేరియన్ అనంతరం మహిళ మృతి
- న్యాయం చేయాలని భర్త, బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బంధువులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాన్పు కోసం హాస్పిటల్‌కు వస్తే గర్భిణిని కాటికి పంపారని మృతురాలి బంధువులు ఆరోపించారు. బాధితుల కథనం మేరకు నగరంలోని పాతబస్తీకి చెందిన నజీయా బేగం నిండు గర్భిణి. ఆమె భర్త సమీర్‌బాషా, గైనకాలజిస్టు డా.రహేలా వద్ద రెగ్యులర్‌గా వైద్యం చేయిస్తున్నారు. సోమవారం రాత్రి ఆమెకు పురిటి నొప్పులు రావడంతో భర్త డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లగా డాక్టర్ సూచన మేరకు నగరంలోని ఎన్ఆర్‌పేటలో ఉన్న ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు సిజేరియన్ చేయగా మగశిశువు పుట్టాడు. అయితే తన భార్యను చూపించాలని డాక్టర్‌ను భర్త కోరాడు. ఇలా ఎన్నిసార్లు అడిగినా భార్యను చూపకపోవడంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీశారు. ఆమె మృతి చెందిందని వైద్యులు చెప్పడంతో బంధువులు ఆందోళనకు దిగారు. ఆపరేషన్ చేసిన డాక్టర్, మత్తు డాక్టర్ ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో గదిలోకి వెళ్లి తాళం వేసుకున్నారు. పోలీసులు రావడంతో మత్తు డాక్టర్ బయటకు రావడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. డాక్టర్‌పై కేసు పెట్టాలని, తమకు న్యాయం చేయాలని భర్త, బంధువులు డిమాండ్ చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళనను విరమించారు.

మరో ముగ్గురు!

- ఉమ్మడి జిల్లాలో టీడీపీ నేతలకు నామినేటెడ్ పదవులు
- ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆకెపోగు ప్రభాకర్
- 'విశ్వబ్రాహ్మణ'కు కె.పార్వతమ్మ 'బొందిలి' చైర్మన్‌గా విక్రమ్‌సింగ్

కర్నూలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు రాష్ట్రంలో పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేశారు. పదవుల పంపకాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఈసారి మరో ముగ్గురికి అవకాశం దక్కింది. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్‌కు ఎస్సీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మకు విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కర్నూలు నగరం 49వ వార్డు ఇన్‌చార్జి, న్యాయవాది డి.విక్రమ్‌సింగ్‌కు బొందిలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీఠం దక్కింది. అయితే ఎన్నికల్లో పొత్తు, రాజకీయ సమీకరణల్లో భాగంగా సీట్లు త్యాగం చేసిన ఆదోని టీడీపీ ఇన్‌చార్జి కె.మీనాక్షినాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఈ దఫా కూడా నిరాశే మిగిలింది. ఈసారైనా వారికి నామినేటెడ్ పదవులు కేటాయిస్తారని ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులు ఎదురు చూశారు.

ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభాకర్



ఆకెపోగు ప్రభాకర్ కోడుమూరు (ఎస్సీ) టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డారు. త్యాగానికి ప్రతిఫలంగా సీఎం చంద్రబాబు ఆయనకు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పదవి ఇచ్చారు. 2001లో గూడూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల్లో కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2004 నుంచి 2014 వరకు, 2019 నుంచి 2024 వరకు కోడుమూరు టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగారు. 2014-19 మధ్యలో ఏపీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేశారు. టీడీపీ జిల్లా లీగల్ సెల్ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శిగా పని చేసిన అనుభవం ఉంది.

పార్వతమ్మకు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ పీఠం



నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ టీడీపీకి చేసిన సేవలను అధినేత, సీఎం చంద్రబాబు గుర్తించారు. విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పీఠంపై ఆమెను కూర్చోబెట్టారు. ఈమె స్వస్థలం నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామం. 18 ఏళ్ల క్రితం కర్నూలుకు చేరుకున్న ఆమె కుటుంబం వ్యాపారంలో రాణిస్తున్నారు. 2009 ఎన్నికల ముందు టీడీపీలో చేరి క్రియాశీలకంగా మారారు. ఉమ్మడి కర్నూలు జిల్లా తెలుగుమహిళా ప్రధాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. జిల్లా విభజన తరువాత నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.

విధేయ విక్రమ్‌కు 'బొందిలి' కార్పొరేషన్

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్‌కు విధేయుడిగా ఉంటూ వస్తున్న న్యాయవాది డి.విక్రమ్‌సింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో స్థానం దక్కింది. ఏపీ బొందిలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేశారు. న్యాయవాది వృత్తిలో రాణిస్తూనే టీడీపీలో ఓ సామాన్య కార్యకర్తగా ఉన్నారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కర్నూలు నగరపాలక సంస్థ 49వ వార్డు స్థానం నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి 120 ఓట్ల తేడాతో ఓటమి చెందారు.



డాక్యుమెంట్స్ అప్‌లోడు చేయాలి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెమోలు, జీవోలు, సర్క్యులర్‌లు కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు లాంటివి అని ఈపీటీఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో డాక్యుమెంట్స్‌ను స్కానింగ్ చేసి అప్‌లోడు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మంగళ వారం పీ-4 పాలసీ, ఈపీటీఎస్ డాక్యుమెంట్స్ అప్‌లోడు అంశాలపై కలెక్టర్ ఆర్డీవోలతో మున్సిపల్ కమిషనర్లుతో, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. హోళగుంద, కోసిగి, కృష్ణగిరి, మంత్రాలయం, మద్దికెర, కౌతాళం మండ లాల ఎంపీడీవోలు, కౌతాళం, ఆదోని, సి.బెళగల్, కోసిగి, ఆలూరు మండలాల తహసీల్దార్లు డాక్యుమెంట్స్‌ను త్వరితగతిన అప్‌లోడు చేయాలన్నారు. ఏడీ సర్వే, సర్వ శిక్ష అభియాన్ శాఖలు ఆన్‌లైన్ అప్‌లోడు చేసే ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు. పీ-4 పాలసీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న నీడ్ అసెస్మెంటు సర్వేను బుధవారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పీ-4 పాలసీ కింద జిల్లాలో ఇప్పటి వరకు 50,904 బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారన్నారు. ఇంకా తొమ్మిది వేల బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

కోటేకల్లులో ఫైరింజన్ బోల్తా



కోటేకల్ సమీపంలో బోల్తాపడ్డ ఫైరింజన్

ఎమ్మిగనూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో ముందుండే ఫైరింజన్ వాహనం ప్రమాదానికి గురైంది. కోటేకల్లు గ్రామ సమీపంలోని అడ్డరోడ్డులో మంగళ వారం ఆదోనికి చెందిన ఫైరింజన్ వాహనం ప్రమాదవ శాత్తు బోల్తాపడింది. మంత్రాల యం నుంచి ఆదోనికి వెళ్తున్న ఫైరింజన్ కోటేకల్లు అడ్డరోడ్డుకు సమీపంలో వేగంగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి రోడ్డుపక్కన పొలంలోకి దూసుకెళ్లింది. అక్కడ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. అయితే ఫైర్ సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అగ్నిమాక శాఖ అధికారులు, సిబ్బంది వెంటనే ఫైరింజన్‌ను అక్కడి నుంచి ఆదోనికి తరలించారు.

కర్నూలు జీజీహెచ్‌లో సెక్యూరిటీ కార్యాలయంపై దాడి

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని సెక్యూరిటీ ఆఫీసుపై ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరులు దాడులు చేయడం కలకలం రేపింది. మంగళవారం సెక్యూరిటీ ఏజెన్సీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఈగల్ అండర్ సంస్థ 20 మందిని సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకుంది. ఈ నియమకాలు ఓ ప్రజాప్రతినిధికి ఆగ్రహం తెప్పించాయి. తమను కాదని ఏకపక్షంగా ఎలా సెక్యూరిటీ పోస్టులను భర్తీ చేస్తారనీ, ఈ నియామకాలు సరిగ్గా లేవని, ఆరోపణలున్న వ్యక్తులను నియమించారనీ సెక్యూరిటీ ఆఫీసర్లతో వాగ్వాదానికి దిగారు. ఆఫీసులో ఉన్న కుర్చీలు, బెంచీలను ఎత్తిపడేశారు. ఘటన జరిగిన తర్వాత ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు రాత్రి 10:30 గంటల సమయంలో సెక్యూరిటీ ఆఫీసును సందర్శించారు. సెక్యూరిటీ పోస్టుల విషయంలో ఇద్దరు నేతల మధ్య ఆదిపత్య పోరు ఆసుపత్రిలో ఇబ్బందికరంగా మారింది.

గృహ నిర్మాణాన్ని పూర్తి చేయండి: పీడీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

ఓర్వకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు గ్రామ లేఅవుట్ కాలనీలో ఇళ్లు పూర్తి చేయని లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. పీడీ చిరంజీవి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50వేలు, రూ.75వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. అలాగే ముందుగా లబ్ధిదారులకు అడ్వాన్సుగా రూ.15వేలు, రూ.30వేలు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, వర్క్ ఇన్స్‌పెక్టర్లు రాము నాయక్, సత్తెన్న, సుగుణమ్మ, మల్లయ్య, పాల్గొన్నారు.

నగరంలో పోలీసుల కవాతు

కర్నూలు క్రైం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలైన షరీఫ్‌నగర్, వీకర్‌సెక్షన్ కాలనీల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. మంగళవారం నాలుగో పట్టణ ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో, పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

సాధారణ ప్రకటన

శ్రీ తరిగోపుల సుధాకర్ రెడ్డి, తండ్రి టి.వెంకట రామి రెడ్డి, ఎస్ఆర్‌ఓ. కల్లూరు ఒరిజినల్ రిజిస్టర్డ్ రెక్టిఫికేషన్ డీడ్ నం. 7071/2015, తేది:21.08.2015కు సంబంధించిన దిగువ షెడ్యూల్ ఆస్తికి గల డాక్యుమెంట్లను తన ఇంటి నుండి బళ్లారి చౌరస్తాకు జిరాక్స్ కొరకు తీసుకువెళ్తుండగా 28.07.2025న పోగొట్టుకున్నారు. పోగొట్టుకున్న/పోయిన టైటిల్ డీడ్‌ను కనిపెట్టడానికి అయన నిజాయితీగా ప్రయత్నించారు కానీ దానిని కనిపెట్టలేకపోయారు. కర్నూలులోని నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సైతం ఆచూకీ కోసం నిజాయితీగా ప్రయత్నించారు కానీ అది లభించలేదు. 05.08.2025న వారు MLD01250056877 ద్వారా పోగొట్టుకున్న/పోయిన టైటిల్ డీడ్‌లను కనిపెట్టడానికి ప్రయత్నాలు జరిగాయని కానీ కనిపెట్టలేకపోయారని పేర్కొంటూ ఒక సర్టిఫికెట్ జారీ చేశారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రిటైల్ అసెట్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్రెడిట్ సెల్) కర్నూలు వారు కాగోరు ఋణగ్రహీత శ్రీమతి సి.హాస్పేయనమ్మ నుండి నమోదిత రెక్టిఫికేషన్ డీడ్ నం.7071/2015, తేది:21.08.2015 యొక్క సర్టిఫైడ్ కాపీ యొక్క లింక్ డాక్యుమెంట్ ప్రాతిపదికన తనఖా లేదా ఇతరత్రా అనగా ఒక ఛార్జ్‌ను సృష్టించాలని భావిస్తున్నారు.

దిగువ పేర్కొన్న షెడ్యూల్ ఆస్తికి ఎవరైనా ఏదైనా అభ్యంతరం లేదా క్లెయిమ్ ఉన్నచో, దానిని ఈ ప్రకటన ప్రచురించబడిన 15 రోజులలోపు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RASMECC, కర్నూలు)కి అదే దాఖలు చేయాగలరు. లేనిచో బ్యాంక్ నమోదిత రెక్టిఫికేషన్ డీడ్ నం.7071/2015 యొక్క సర్టిఫైడ్ కాపీ యొక్క లింక్ డాక్యుమెంట్ ప్రాతిపదికన తనఖా లేదా ఇతరత్రా అనగా ఒక ఛార్జ్ సృష్టిస్తారు.

ఆస్తి షెడ్యూల్: కర్నూల్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు కల్లూరు ఉప రిజిస్ట్రేషన్ జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం కల్లూరు గ్రామం యొక్క సర్వే నం.380/బి1 &సర్వే నం.380/బి3 లో ప్రియా హోమ్స్ ఫేజ్-2 లో వేసిన ప్లాట్ నం.4 యావత్తు. **ప్లాట్ నం.4 సరిహద్దులు:-** ఉత్తరం: ప్రియా హోమ్స్ ఫేజ్-2లో ప్లాట్ నం.3, దక్షిణం: ప్రియా హోమ్స్ ఫేజ్-2లో ప్లాట్ నం.5, తూర్పు: 30 అడుగుల వెడల్పు రోడ్డు, పశ్చిమం: మిగిలిన భూమి (12 1/2 అ.లు * 485 అడుగులు). **విస్తీర్ణం:** 150 చ.గ.లు, తూర్పు-పశ్చిమం: 45 అ.లు, ఉత్తర-దక్షిణం: 30 అ.లు.

ఎస్.షకీల్ అహ్మద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరఫున ప్యానెల్ న్యాయవాది,
ఇ.నం: 62/24, మేడమీద, ఫోర్ట్, పాత బస్టాండ్, కర్నూలు-518002,సెల్: 9701833324

నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

కల్లూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం 30వ వార్డు శరీన్‌నగర్‌లో నాయీబ్రాహ్మణులు త్యాగరాజ మందిరంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను సీఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వ రరావు యాదవ్, జనసేన అధ్యక్షుడు చింతాసురేష్, నాయీ బ్రాహ్మణ కార్పొ రేషన్ డైరెక్టర్ విజయ్‌కుమార్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, మాజీ ఎంపీపీ వాకిటి మాధవి, కార్పొరేటర్ జయరాం, శైలజాయాదవ్, ఎన్వీ. రామకృష్ణ, పుల్లయ్యగౌడ్, శ్రీనివాసరావు, మద్దయ్య పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన పలువురు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మంగళవారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు గౌరు దంపతుల సమక్షంలో కొట్టాల తులసిరెడ్డి, బెంగళూరు మద్దయ్య, బొరెల్లి శ్రీనివాసులుతో పాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. గౌరు దంపతులతోపాటు యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో హబీబ్‌ఖాన్, శ్రీనివాసులు, కరువ లక్ష్మన్న, గొల్లకిరణ్, వెంకటేశ్వర్లు, కరువ లింగన్న, మధు, రామాంజనేయులు, సురేష్. షేక్షా, జహంగీర్, వీరేష్, గోకారి, రఫీ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఒక్క అవకాశం పేరుతో జగన్ విధ్వంసం

- హత్యలు, ఆస్తుల కబ్జాలో సిద్ధహస్తుడు
- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సోమిశెట్టి

కర్నూలు అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఒక్క అవకాశం పేరుతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన జగన్‌కు హత్యలు చేయడం, ఆస్తులు లాక్కోవడంలో సిద్ధహస్తుడని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్ హత్యా రాజకీయాలను ప్రోత్సహించారన్నారు. జగన్ అధికారంలో ఉన్న సమయంలో ఉన్న పరిశ్రమలు మూత పడ్డాయని, ఉన్నత విద్యలు చదివిన యువతకు ఉపాధి, అవకాశాలు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. జగన్‌కు ఓటు వేసి చాలా పెద్ద తప్పు చేశామనే నిర్ణయానికి వచ్చిన ప్రజలు 2024 ఎన్నికల్లో జగన్‌కు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారని అన్నారు. నేడు సీఎంగా చంద్రబాబునాయుడు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నారన్నారు.

వృథా నీటిపై రాజకీయాలా..?

కర్నూలు అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సముద్రంలో వృథాగా కలిసే నీటిపై తెలంగాణ నాయకుల రాజకీయాలు తగవని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధరూర్ జేమ్స్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ నాయకులు నీటిపై అనవసరంగా మాట్లాడుతూ సీమాంధ్రుల హక్కులను హరించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్, వైసీపీ పాలనలో సీమాంధ్ర ఎంతో నష్టపోయిందని, గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం నిధులు, నీళ్లు, ఉపాధి అవకాశాలను కల్పిస్తుంటే జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. గోదావరి నదిలోకి ఏటా 3వేల టీఎంసీ నీరు వృథాగా పోతోందని, వీటిని వాడుకోవడం తప్పా అని ప్రశ్నించారు. కర్నూలు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు తరలించి అక్కడి ప్రజలకు సాగు, తాగునీరు అందించే మహా సంకల్పాన్ని చంద్రబాబు చేపడితే అడ్డుకునే కుట్రలు చేస్తున్నారన్నారు.

సిల్వర్ జూబ్లీలో 'హర్ ఘర్ తిరంగా'

కర్నూలు అర్బన్ ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నవ్య, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, సెట్కూర్ సీఈవో డాక్టర్ వేణుగోపాల్, 9 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కర్నూలు ప్రసాద్ జాతీయ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల నుంచి సి.క్యాంప్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో సెట్కూర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యానా రాయణ, కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: నగరంలోని ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం 'హర్‌ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించారు. కర్నూలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ప్రాంగణంలోని సంగీత కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు దేశభక్తి గీతాలను ఆలపిస్తూ కొండారెడ్డి బురుజు, పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కృష్ణానగర్‌లో చోరీ

కర్నూలు క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పాత కృష్ణానగర్‌లో విజయకుమార్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. విజయకుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉరుకుంద ఈరన్న క్షేత్రానికి వెళ్లారు. సోమవారం ఇంటికి రావాల్సి ఉండగా.. ఇంటికి రాకుండా సొంతూరైన కొంగనపాడు గ్రామానికి వెళ్లాడు. మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తలుపులు పగులకొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న దుస్తులు చిందర వందరగా పడిఉన్నాయి. బీరువాలో ఉన్న 12 తులాల బంగారు నగలు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గౌరు దంపతులను కలిసిన పార్వతమ్మ

కల్లూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఎంపికైన కె.పార్వతమ్మ మంగళవారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ కోసం కష్టపడ్డ నాయకులకు సీఎం చంద్రబాబు ఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయని గౌరుదంపతులు కె.పార్వతమ్మను అభినందించారు. అనంతరం పార్వతమ్మను గౌరు దంపతులు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

పన్ను వసూళ్లలో అలసత్వం వహిస్తే చర్యలు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పన్నుల వసూళ్లలో అధికారుల, సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణతో కలిసి రెవెన్యూ అధికారులు, అడ్మిన్ కార్యదర్శులతో పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి బకాయిలు ఉన్న ఆస్తి పన్నులను వెంటనే వసూలు చేయాలన్నారు. మొండి బకాయిల జాబితా అధికంగా ఉన్న అధికారులు, అడ్మిన్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌ఓ వాజిద్, ఆర్‌ఐలు జిఎం.శ్రీకాంత్, తిప్పన్న, సొహైల్, రాజు, శివశంకర్, ఖలీల్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు : నగరంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం నగర పాలక కార్యాలయంలో ప్రజారోగ్య సాంకేతిక, గ్రామీణ తాగునీటి సరఫరా, జలవనరుల శాఖల అధికారులతో పాటు నగరపాలక ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగర సమీప ప్రాంతాల్లో ఉన్న నీటి ప్రాజెక్టులు, నదులు, రిజర్వాయర్లకు సంబంధించి నీటి వనరులపై చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధి రోజు రోజుకు విస్తరిస్తున్న నేపథ్యంలో తాగునీటి శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. అమృత్ 2.0లో భాగంగా మున్సిపల్, ప్రజారోగ్య సాంకేతిక, గ్రామీణ తాగునీటి సరఫరా, జలవనరుల శాఖల అధికారులతో సమ న్వయ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు లకు అనుగుణంగా మూడు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. తుంగభద్ర, హంద్రీ, గోరుకల్లు రిజర్వాయర్లపై ప్రాజెక్టుల నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ ఆర్.రాంమోహన్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రా రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వి.అమల, పీడబ్ల్యూ డీఈ ప్రసాద్‌రావు, మున్సిపల్ ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీఈఈలు గిరిరాజు, నరేష్, క్రిష్ణలత, ఏఈ జనార్దన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

రంగనాథన్ సేవలు చిరస్మరణీయం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దేశంలో గ్రంథాలయాల పురోభివృద్ధికి ఎస్ఆర్ రంగనాథన్ చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ కొనియాడారు. మంగళవారం పాతనగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో, గ్రంథాలయ ఉద్యమ పితామహుడు, గ్రంథాలయాల్లో పుస్తకాలకు కోడ్‌ను రూపకల్పన చేసిన మహనీయుడు దివంగత ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1892 ఆగస్టు 12న నాటి మద్రాసు రాష్ట్రంలో జన్మించిన ఎస్ఆర్ రంగనాథన్ గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాషా, కార్యాలయ ఉద్యోగులు మక్బుల్ బాషా, రాజు, సుదర్శన్, పాఠకులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహకుడు వెంకటేశ్వర్లు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలయ్య, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



రంగనాథన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ అధికారులు

ఫెర్టిలిటీ వైద్యులకు అవార్డులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మంగళగిరి ఎయిమ్స్‌లో జరిగిన ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెడ్ రిప్రొడక్షన్ సౌత్ ఇండియా సదస్సులో కర్నూలుకు చెందిన ఫెర్టిలిటీ స్పెషలిస్టు వైద్యులు డా.పి.విష్ణుప్రియ, డా.విజయలక్ష్మి దాసరి అవార్డులను అందుకున్నారు. విజయవాడలో జరిగిన సౌత్ ఇండియా ఇసార్ సదస్సులో ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు డా.పి.విష్ణుప్రియకు ఇసార్ ద్రోణా చార్య అవార్డును జాతీయ అధ్యక్షుడు డా.అమిత్ పాటిల్‌కు అందజేశారు. సంతానోత్పత్తి చికిత్సలో నూతన పద్ధతులు వంధ్యత్వ రంగంలో చేసిన అవిశ్రాంతి కృషికి ద్రోణాచార్య అవార్డును అందించారు. మరో ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు డా.విజయలక్ష్మి దాసరి సంతానోత్పత్తిలో రోగికి మెరుగైన ఫలితాలు అందించడం వినూత్న విధానాలు అవలంభించినందుకు దాసరికి ఇసార్ యంగ్ అచీవర్ అవార్డును జాతీయ అధ్యక్షుడు డా.అమిత్ పాట్కి, రాష్ట్ర అధ్యక్షులు డా.పద్మలత అందించారు. ఈ సందర్భంగా కర్నూలులోని గాయత్రీ ఎస్టేట్‌లోని విష్ణు ప్రియ టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్‌లో సౌత్ ఇసార్ అవార్డు గురించి ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు డా.విష్ణుప్రియ డా.విజయలక్ష్మి దాసరి విలేకరులకు వివరించారు. ఇసార్ రాష్ట్ర కమిటీలో స్టేట్ ఉపా ధ్యక్షురాలిగా డా.పి.విష్ణుప్రియ స్టేట్ జాయింట్ సెక్రటరీగా డా.విజయలక్ష్మి దాసరి, ఈసీ సభ్యులుగా డా.భార్గవిరెడ్డి ఎన్నికైనట్లు తెలిపారు.



అవార్డులతో డాక్టర్లు విష్ణుప్రియ, విజయలక్ష్మి

స్కిల్ డెవలప్‌మెంట్ సమీక్షలో ఎంపీ బస్తిపాటి

కర్నూలు అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో పార్లమెంట్ భవన్‌లో మంగళవారం జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ సమీక్షకు కమిటీ సభ్యుడిగా ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. ఆ రంగానికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రం, జిల్లాలో ఆ రంగానికి సంబంధించిన అంశాల్లో న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

కర్నూలు రూరల్ ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కర్నూలు 1, 2 డిపోల ఎదుట నాయకులు, కార్మికులు ధర్నా చేశారు. ఈకార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఎన్ఆర్ నాయుడు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జోనల్ అధ్యక్షుడు వినోద్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, పీఎండీ ఇస్మాయిల్ పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు రవీంద్ర బాబు, పీఏ వలి, గౌస్, ఎస్‌బీరెడ్డి, ఇసాక్ కార్మికులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

కర్నూలు అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పని చేస్తానని ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ కార్యదర్శి నాగమధు యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయనను సన్మానించారు. నాగమధు యాదవ్ మాట్లాడుతూ బాల్యం నుంచి కాంగ్రెస్ వాదిగా పని చేశానని, నా సేవలను గుర్తించి యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, మాజీ డీసీసీ బాబురావు, నాయకులు దామోదరం రాధాకృష్ణ, ఖాసీంవలి, బతుకన్న, లాజరస్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఓర్వకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ ఎదురుగా మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం సిమెంటు నగర్ గ్రామానికి చెందిన తల్లి కొడుకులు నాగలక్ష్మి, నాగేంద్ర కర్నూలు నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా.. వీరి వాహనాన్ని వెనుక వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వీరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తాం: ఏఈ

గూడూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కానాపురం గ్రామంలో ఒదిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు. మంగళవారం ఆర్.కానాపురంలో ఒదిగిన విద్యుత్ స్తంభాన్ని ఆయన పరిశీలించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

కల్లూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని ప్రభుత్వ పొరుగు సేవల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీ మస్తాన్, జిల్లా అధ్యక్షుడు మల్లయ్య కోరారు. మంగళవారం నగరంలోని బిర్లాగేట్ సమీపంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన ఏపీ ఎన్జీఓ, ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌రావుకు సంఘం నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్‌సీ పాలసీ కల్పించాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి: ఎంఈవో

ఓర్వకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని గుట్టపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను, విద్యార్థుల మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఎఫ్‌ఏ-1 ఎగ్జామ్స్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

మెనూ పాటించకపోతే చర్యలు

సి.బెళగల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మెనూ పాటించని వంట ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి జ్యోతి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని స్పెషల్, రెగ్యులర్ పాఠశాలలను ఎంఈవో తనిఖీ చేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెల కొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం, ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమైఖ్య 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలోని సీఆర్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు సోమన్న అధ్యక్షతన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సాబీర్ బాషా, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ మేళా

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సంస్థ కార్యాలయాల వద్ద ఈనెల 14న ఉచిత 4జి సిమ్ మెగా మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ మంగళవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మొబైల్ టవర్లను 4జీ టవర్లుగా మార్చామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టులో బీఎస్ఎన్ఎల్ ఫ్రీడం ప్లాన్‌ను దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిందన్నారు. ఈ ఆఫర్ కింద కేవలం రూ.1కే 30 రోజులపాటు ప్రతిరోజు 2జీబీ డేటా, అపరిమితమైన కాల్స్, 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చాన్నారు. ఈ ఆఫర్ ఈనెల 31 వరకే ఉంటుందన్నారు.

వెంగళ్‌రెడ్డి సేవలు మరువలేనివి



వెంగళ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి అసోసియేషన్‌కు చేసిన సేవలు మరువ లేనివని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ కొనియాడారు. మంగళవారం ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డి వీడ్కోలు ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వెంగల్‌రెడ్డి ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్‌కు 20 సం వత్సరాల పాటు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రమణ, కాశన్న, కృష్ణుడు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి యోగా పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలు మంగళవారంతో ముగిశాయి. జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అవినాష్‌శెట్టి, మునిస్వామి మాట్లాడుతూ 65 పాయింట్లతో ఇండస్ పాఠశాల క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా, 60 పాయింట్లతో వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాల నిలువగా, 50పాయింట్లతో మూడో స్థానంలో ఆదోని క్రీడాకారులు నిలిచారని తెలిపారు.

రంగనాథన్ జయంతి

పత్తికొండ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ జయంతి స్థానిక గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. చిత్రపటానికి ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి విశ్వనాథరెడ్డి, గ్రంథాలయ అధికారి రామ్‌కుమార్ నివాళులు అర్పించారు.

మార్కెట్ యార్డులో తిరంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మువ్వన్నెల జెండాతో జాతీయ సమైక్యతను చాటాలని మార్కెట్ యార్డ్ సహాయ కార్యదర్శి శాంత కుమార్ అన్నారు. మంగళవారం యార్డులో జాతీయ జెండాను పట్టుకొని రైతులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, కూలీలు, హమాలీలు, ర్యాలీ నిర్వహిఇంచారు. సూపర్వైజర్లు రాము, మోహన్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు అశోక్ పాల్గొన్నారు.

అందుబాటులో మున్సిపల్ సిబ్బంది


పూడికతీతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలయమైతే మున్సిపల్ 150 మంది సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో నీట మునిగిన ఆవుదూడ వంక, వడ్డేగేరి, బోయగేరి, రాయనగర్‌తోపాటు పలు ప్రాంతాలను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ముందు జాగ్రత్త తీసుకోకపోవడంతోనే ఆహార ధాన్యాలు తడిసి, అనేక కుటుంబాలు నిరాశ్రయులయ్యారన్నారు. నెలాఖరు వరకు వర్షాలు కురిసే అవకాశముందని మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఎక్స్‌వేటర్‌తో కాలువల్లో పూడికతీయించాలని ఆదేశించారు. ఎంఈ సత్యనారాయణ, డీఈ చలపతి, రామ్మూర్తి, మేస్త్రీలు, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో ఎదుగుదల


ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న రామగిడ్డయ్య

పత్తికొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణతోనే పిల్లల్లో ఎదుగుదల వుంటుందని వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ రామగిడ్డయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పిల్లలకు మాత్రలను మిగించారు. నులి పురుగుల ప్రభావంతో పిల్లల్లో ఆకలిమందగించడం పోషకాహారం తీసుకోలేని సమస్యలు ఎదురవుతాయన్నారు. అల్బెండజోల్ మాత్ర వేసుకుంటే కడుపులో నులిపురుగులు నశించిపోతాయని చిన్నారులు ప్రతిఒక్కరూ ప్రభుత్వం ఉచితంగా అందించే ఈ మాత్రలను వేసుకోవాలన్నారు. . అనంతరం డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఈరోజు 15,990 పిల్లలకు మాత్రలను పంపిణీ చేశామన్నారు.

ఆలూరు-హొళగుంద రోడ్డుకు మోక్షం

● రూ.3.50 కోట్లతో పనులు ప్రారంభం


కొలతలు వేస్తున్న పీఐయూ ప్రాజెక్టు డీఈఈ భాస్కర్

ఆలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి హొళగుంద రోడ్డు నిర్మాణానికి రూ.3.50 కోట్ల నాబార్డు నిధులు కేటాయించటంతో ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆలూరు అంబేడ్కర్ కూడలి వరకు రహదారి పనుతు చేయనున్నట్లు పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ డీఈఈ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రహదారి కొలతలు తీసుకున్నారు. పంచాయతీరాజ్ కార్యాలయం నుంచి మోడల్ స్కూల్ వరకు వర్షపునీరు నిలిచి, విద్యార్థులు ఇబ్బందులను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. త్వరలోనే పనులు ఆరంభించి పూర్తి చేస్తామని డీఈఈ తెలిపారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

ఆలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సహ విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ మహబూబ్‌బాషా సూచించారు. మంగళవారం అరికెర అంబేడ్కర్ బాలుర గురుకులంలో విద్యార్థులకు ర్యాగింగ్, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై వివరించారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ మనోరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

పత్తికొండ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ జెండాను మాజీ నాయకులు కృష్ణ ఎగురవేశారు. శ్రీకాంత్, మనోహర్, రంగస్వామి, రామాంజనేయులు, అల్తాఫ్ ఉన్నారు.

పొలంలో నీరు.. రైతు కన్నీరు

● మద్దికెర మండలంలో ఎడతెరిపి లేని వర్షం ● నీట మునిగిన జొన్న, పత్తి పంటలు


మద్దికెరలో జొన్నపొలంలో నిలిచిన నీరు


పత్తి పొలంలోనూ ఇంతే..

మద్దికెర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజుల నుంచి ఎడతెరపి లేని వర్షాలు కురిశాయి. దీంతో పొజొన్న, పత్తి, కంది పొలాల్లో నీరు నిలిచింది. మండలంలో 7,500 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండటం వల్ల వర్షం నీరు పొలాల్లో నిల్వ ఉండి పంటలు ఎర్రబారుతున్నాయపి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువులు పిచికారీ చేయాలి

ఎడతెరిపి లేని వర్షాలతో పంటల్లో తేమ పెరిగిందని, పంటలు దెబ్బతినకుండా ఎరువులు పిచికారీ చేయాలని ఏవో రవి సూచించారు. మంగళవారం రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతూ పొలాల్లో నిలిచిన నీటిని ముందుగా బయటకు పంపాలన్నారు. అనంతరం 20 కిలోల యూరియా, 15 కిలోల పోటాష్‌ను చల్లాలన్నారు. అలాగే 13045 రకం ఎరువును ఎకరాకు కిలో చొప్పున పిచికానీ చేయాలని తెలిపారు. తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సోప్లోరైడ్ లీటరు నీటికి 3 గ్రాములను కలిపి మొక్కలు తడిచేలా పిచికారీ చేస్తే తెగుళ్లను నివారించవచ్చన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగు నివారణకు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. సిబ్బంది ఆనంద్ ఉన్నారు.

నేర నియంత్రణకు కృషి చేయాలి

● ఎస్పీ విక్రాంత్ పాటిల్
● ఇస్వీ పీఎస్ తనిఖీ


స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆదోని రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు నిరంతరం ప్రజల్లో ఉండి నేర నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం డీఎస్పీ హేమలత, రూరల్ సీఐ నల్లప్పతో కలిసి ఇస్వీ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని కేసుల వివరాలను తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా చేసుకోవలని అల్లర్లకు పాల్పడితే ఊపేక్షించబోమని హెచ్చరించారు. అనంతరం స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్టేషన్‌కొచ్చిన బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ముందుకు

● ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు
● పత్తికొండలో ర్యాలీ హాజరైన మాజీ డిప్యూటీ సీఎం కేఈ


ఎడ్లబండిపై ఎమ్మెల్యే కేఈ, టీడీపీ సీనియర్ నాయకులు

పత్తికొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు చేసినందుకు రైతులతో కలిసి పత్తికొండలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి పొల్గొని కార్యకర్తలను ఉత్సాహపరిచారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి మార్కెట్ యార్డు వరకు సాగిన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే స్వయంగా ఎడ్లబండి తోలుతూ ముందుకు సాగారు. నియోజకవర్గంలోని పథకం కింద 54,774 మంది రైతులు లబ్ధి పొందారన్నారు. పందికోన రిజర్వాయర్ పెండింగ్ పనుల పూర్తికి రూ.250 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు తుగ్గలినాగేంద్ర, తిమ్మయ్యచౌదరి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఆలంకొండ నబి, ట్రైబల్‌బోర్డు సభ్యుడు వెంకటపతి, రామానాయుడు, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, కాకర్ల లక్ష్మీనారాయణ, కడవలసుధాకర్, బత్తినిలోక్‌నాథ్, మద్దికెర రాజన్న యాదవ్ ఉన్నారు.


మాజీ డిప్యూటీ సీఎం కేఈ

సమస్యలను వేగంగా పరిష్కరించాలి

వెల్దుర్తి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని వెల్దుర్తి మండలాధ్యక్షురాలు దేశాయి లక్ష్మీదేవమ్మ అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సూదేపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన పట్టుపురుగుల పెంపక కేంద్రం నిర్వీర్యమైందని, బాగు చేసేందుకు అధికారులు సహకరించాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఈవో ఆర్‌డీ రవికిషోర్, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

విద్యార్థి సంఘాల గొంతు నొక్కే కుట్ర


ఆందోళన చేస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోకి వెళ్ళరాదంటూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి, విద్యార్థి సంఘాల గొంతు నొక్కే కుట్రకు పాల్పడుతోందని పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మిగనూరు రోడ్డులో ఆందోళన పచేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను హరించి పాఠశాలలను జైలుగా మర్చేలా జీవో తెచ్చిందన్నారు. శివ, వసంత, కుమార్, తిరుపాల్ పాల్గొన్నారు.

జీవోను రద్దు చేయాలి: విద్యార్థుల హక్కులను హరించే జీవోను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, బీడీఎస్ఎఫ్, డిఎస్ఎఫ్, ఆర్‌పీఎస్ఎఫ్, పీడీఎస్‌వో నాయకులు శ్రీనివాసులు దస్తగిరి, తిరుమలేష్, రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థి సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, బాబు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

దేవనకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందని సీపీఐ మండల కార్యదర్శి నర్సారావ్ అన్నారు. మంగళవారం వెంకటేశ్వర డీగ్రీ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. నాయకుడు మనోజ్ జెండాను ఆవిష్కరించారు. సురేష్, రంజాన్ పాల్గొన్నారు.

నానో ఎరువులను వాడాలి : ఏడీఏ

ఆలూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో ఎరువులను వాడాలని, రసాయన ఎరువులు తగ్గించుకో వాలని ఆలూరు ఏడీఏ చెంగలరాయుడు సూచించారు. మంగళవారం మాట్లాడుతూ రైతుకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందేలారాష్ట్ర ప్రభుత్వం నానో యూరియా డీఏపీ పిచికారీ మందులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. విత్తనం వేసే సయయంలో కాంప్లెక్స్ ఎరువులు డీఏపీ, 19:19:19 తదితర ఎరువులు వేయాలన్నారు. పంట వేసిన 20 రోజులకు నానో యూరియా మందులు పిచికారీ చేస్తే పంటకు మేలు జరుగుతుందన్నారు.

అవార్డులు బాధ్యత పెంచుతాయి


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న వైద్యాధికారి రాగిణి

మద్దికెర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అవార్డులు ఉద్యోగులకు బాధ్యతను పెంచుతాయని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, ఏవో రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నీతి అయోగ్‌లో మండలం ప్రతిభ చూపడంతో కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్సీ బీటీ నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకోవడంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు మరింత అందుబాటులో ఉండి సేవలందిస్తామని తెలిపారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

మద్దికెర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారనీ ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. మంగళవారం మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, ఎరవలి గ్రామాల్లో వైద్యసిబ్బంది విద్యార్థులచే అల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈగలు, దుమ్ము, దూళి, కలుషిత తినుబండారాలతో పిల్లల కడుపులో నులి పురుగులలు వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు శుభ్రమైన నీటితో కడగాలన్నారు. సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి అక్బర్‌బాషా, సూర్యనారాయణ, క్రిష్ణమ్మ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆస్పరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. మంగళవారం తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. హంద్రీనీవా పరీవాహక గ్రామాలు ముత్తుకూరు, పుటకలమర్రి, వలగొండ, కైరుప్పల, కారుమంచి గ్రామాల్లో పత్తి, జొన్న, సజ్జ, పచ్చిమిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని కోరారు. హనుమంతు, రంగప్ప, గోవిందు, రవి ఉన్నారు.

పొంగిన కాలువ


పొంగి పొర్లుతున్న చిన్నహరివాణం రహదారిలోని కాలువ

ఆదోని రూరల్, ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వారం నుంచి కురుస్తున్న వర్షాలతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. పొలాల్లోకి నీరు చేరడంతో పంటలు మునిగి రైతులు ఇబ్బంది పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇంకా నీరు ఉంది. చిన్నహరివాణం, బసాపురం, పెద్దహరివాణం, నాగనాథనహళ్ళి ప్రధాన రహదారిలో ఉన్న వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి.

ఇళ్ల ముందే మురుగు


జొన్నగిరి ఎస్సీ కాలనీలో మురుగు

తుగ్గలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు వేసిన అధికారులు, డ్రైనేజీ నిర్మించలేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీరు ఇళ్ల ముందు నిలుస్తోంది. అంగన్‌వాడీ కేంద్రం వద్ద నీరు నిలవడంతో చిన్న పిల్లల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

భూములు ఇచ్చేది లేదు

ఆలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పవర్ గ్రిడ్ ఏర్పాటుకు తమ భూములు ఇవ్వమని రైతులు అధికారులకు తేల్చి చెప్పారు. మంగళవారం మనెకుర్తి గ్రామంలో రెవెన్యూ అధికారులు అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుకు రైతులు భూములిచ్చి సహకరించాలని తహసీల్దార్ శోభాసువర్ణమ్మ కోరగా మూడు గ్రామాల రైతులు అంగీకారం తెలపలేదు. పచ్చని పంట పొలాలను పవర్‌గ్రిడ్‌కు ఎలా ఇస్తామన్నారు. మరోచోట అనువైన ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీపీఎం నాయకుడు హనుమంతు మాట్లాడుతూ పవర్‌గ్రిడ్ ఏర్పాటుతో మూడు గ్రామాల రైతులు భూములు కోల్పోతారన్నారు. డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐ బసవన్నగౌడ్ పాల్గొన్నారు.

ఉపాధి టెక్నీషియన్ మృతి

ఆలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో బేర్‌పుట్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న గాదెప్ప(52) మంగళవారం మృతిచెందాడు. వివరాల మేరకు.. విధులకు వస్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలాడు. ఏపీడీ పక్కీరప్ప, ఏపీవో శ్రీనివాసులు సిబ్బంది గ్రామానికి చేరుకుని గాదెప్ప మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. భార్య లక్ష్మికి అంత్యక్రియల కోసం రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు.

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


విద్యార్థిచే మాత్ర మింగిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యకరమైన జీవనశైలి వస్తుందని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లల్లో శుభ్రత, పరిశుభ్రత అలవా టు చేయడం, సక్రమమైన ఆహారపు అలవాట్లతో నులి పురుగులను నివారించవచ్చ న్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. డీడీ రంగనాథరావు, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురాం రెడ్డి, మెడికల్ ఆఫీసర్ షాహినాజ్‌బేగం, డాక్టర్ సందీప్, డీపీఎంవో సీతారాముడు, జ్ఞానేశ్వర్, మధు పాల్గొన్నారు.

మాత్రలు పంపిణీ

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబళం పీహెచ్‌సీ పరిధిలో పిల్లలకు మంగళవారం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యులు హిమ్రాన్, ఆశాలత ఉన్నారు.

పత్తాలేని సచివాలయ ఉద్యోగులు

● పి.కోటకొండలో నిరసన తెలిపిన గ్రామస్థులు


సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

దేవనకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కోటకొండ గ్రామ సచివాలయం మంగళవారం ఉదయం 11 గంటలైనా తెరవలేదు. వివిధ పనుల నిమిత్తం గ్రామస్థులు నిరాశతో వెనుదిరిగారు. గ్రామస్థులు, డీవైఎఫ్ఐ నాయకులు సచివాయలం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకొవాలని సీఐటీయూ కార్యదర్శి సూరి, అనిల్ డిమాండ్ చేశారు.

దాత సహకారంతో..


కొనసాగుతున్న పనులు

ఆదోని టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాత ఫ్లైఓవర్ పక్కన శిథిలమైన కల్వర్టును దాత సోమిశెట్టి సుబ్బారావు సహకారంతో నిర్మిస్తున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షంతో చుట్టు పక్కనున్న దుకాణాలు, ప్రైవేటు కళాశాలలోకి వర్షం నీరు చేరింది. దీంతో వారి ఇబ్బందులను గుర్తించిన కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ దాత దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ముందుకు వచ్చారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి

● జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గిడ్డయ్యను


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

పత్తికొండ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి): ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సి.ఆర్.భవన్‌లో మాట్లాడుతూ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ పేద, బడుగు, బలహీనవర్గాల రైతు, కార్మికుల సంక్షేమం కోసం పోరాడుతూనే ఉంటుందన్నారు. జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గిడ్డయ్యను ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో పాత్రికేయులు సన్మానించారు. స్థానిక రంగన్న, సాలురంగడు, ఓబులేష్, గౌరవ సలహాదారుడు నాగరాజు, హనుమంతు, రమేష్ ఉన్నారు.

మందుల కొరత రాకుండా చూస్తాం


మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ డా.జఫ్రుల్లా

వెల్దుర్తి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత రాకుండా చూస్తామని హెల్త్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ డా.జఫ్రుల్లా అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఓపీ రోగులు పెరగడం సంతోషకరమన్నారు. సాధారణ కాన్పులు చేయడం హర్షణీయమని, వైద్యులు రోగులను ఆప్యాయంగా పలకరిస్తే సగం వ్యాధి నయమవుతుందన్నారు. ఆసుపత్రిలో మందులు లేనిపక్షంలో ఆసుపత్రి సిబ్బంది నెలకు రూ.5వేల వరకు బయట నుంచి తీసుకువచ్చి రోగులకు ఇవ్వాలన్నారు. ఇన్‌చార్జి బాలచంద్రారెడ్డి ఉన్నారు.

చీకటి జీవోను రద్దు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లోకి, జూనియర్ కళాశాలల్లోకి విద్యార్థి సంఘాలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన చీకటి జీవోను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు ఖాదర్, ఎస్ఎస్‌యూఐ తాలూకా అధ్యక్షులు రంగస్వామి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకలు నరసింహరెడ్డి, ఇమ్రాన్, రాజు, జనార్థన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటకం



శ్రీకృష్ణతులాభారం నాటకంలో కృష్ణసత్యభామల పాత్రధారులు

మంత్రాలయం ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) రాఘవేంద్రస్వామి మహారథోత్సవాన్ని పురస్కరించుకుని గురు రాఘవేంద్ర నాటక కళాసమితి ఆధ్వర్యంలో మూడున్నర వజ్రం, శ్రీకృష్ణ తులాభారం, సుభద్రా రాయబారం, యవరావణ సంగ్రామం, భవాని చింతామణి పౌరాణిక నాటకం భక్తులను ఆకట్టుకుంది. మంగళవారం రాత్రి ఎంటీఆర్ లైనులో ప్రత్యేక వేదికపై మాస్టర్ పద్మనాభాచార్, రాఘవేంద్రాచార్ ఆధ్వర్యంలో పౌరాణిక నాటకాలు ఆకట్టుకున్నాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో ఆశీస్సులతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి, గురెడ్డి భీమిరెడ్డి, జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరాణిక నాటకాలు కనువిందు చేశాయి. వీరిని మెచ్చి పీఠాధిపతి, వివిధ రాజకీయ నాయకులు కళాకారులకు నగదు రూపంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డె నారాయణ, సుంకప్ప, వెంకటేశ్వర్లు, సాగర్, గోపాల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలతో మంచి గుర్తింపు



నాగమధు యాదవ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మిగ నూరు రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సమస్యలపై పోరాటాలతో ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ కో-కన్వీనర్ ఖాశింవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ పేర్కొన్నారు. విద్యార్థి సంఘంలో ఉంటూ సమస్యలపై పోరాటాలు చేసిన నాగమధు యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా నియమించడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో షాకీర్, లోకేష్, అజయ్, భాస్కర్‌లు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పంపన్నగౌడు

నందవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడుగా పంపన్నగౌడు ఎన్నికయ్యారు. కర్నూలులో జరిగిన 24వ జిల్లా మహా సభల్లో మూడోసారి కూడా జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో రెండు పర్యాయాలు జిల్లా కార్యవర్గ సభ్యులుగా పని చేశాడు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

పెద్దకడబూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన రోడ్లకు నాణ్యత లేకుండా ప్యాచ్‌వర్క్ పనులు చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆర్‌వీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ఖాజా, కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోనిలోని ఆర్అండ్‌బీ డీఈఈ పద్మనాభరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గోనెగండ్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంజహళ్లి గ్రామ సమీపంలో ప్రైవేట్ పాఠశాల బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి వెళ్లింది. అయితే ఎవ్వరికి ప్రమాదం జరగలేదు. బస్సులో అందరు చిన్నపిల్లలు మాత్రమే ఉన్నారు. ప్రమాదం తృటిలో తప్పిందని పిల్లల తల్లిదండ్రులు అన్నారు. మంగళవారం సాయంత్రం గోనెగండ్ల నుంచి గంజహళ్లి గ్రామానికి వెలుతుండగా బస్సును రివర్స్ చేసే సమయంలో బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి వెళ్లింది. పొలాల్లోని రైతులు, స్థానికులు బస్సును సరిచేసి విద్యార్థులను పంపివేశారు.

బస్టాండ్ స్థల ప్రైవేటీకరణ విరమించుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ గవర్నర్‌పేట -1 డిపో, పాత బస్టాండ్ స్థలాన్ని ప్రైవేట్ సంస్థకు షాపింగ్ మాల్ కోసం ఇవ్వాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను విరమించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాహెబ్ మాధవ్, భాష, ఖాసిం, లలిత పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోయే ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ ఆటో ట్రాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆటో కార్మికుని ఉపాధి కల్పనకై రూ.12వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, గిరిబాబు, సోమేశ్వర, భాష పాల్గొన్నారు.

మోటారు సైకిళ్లు ఢీ.. ఇద్దరికి గాయాలు

మంత్రాలయం ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సూగూరు రోడ్డులో రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం మంగళవారం జరిగింది. కర్ణాటకలోని తుంగభద్ర గ్రామానికి చెందిన రాజశేఖర్ మాధవరంలోని బంధువుల ఇంటికి వచ్చి బైక్‌పై సూగూరు రోడ్డులో ఉన్న పొలానికి వెళ్తుండగా.. మాధవరం నుంచి ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన అశోక్ వెనకాల నుంచి వచ్చి ఢీకొట్టారు. దీంతో రెండు మోటారు సైకిళ్లు ఎగిరిపడ్డాయి. ఇద్దరికి తీవ్రమైన గాయాలు కావడంతో రాజశేఖర్‌ను రాయచూరు ఆసుపత్రికి, అశోక్‌ను ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె

గోనెగండ్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయిబ్రాహ్మణ కాలనీలో మంగళవారం ఉదయం మంగలి శారదమ్మకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. ఈ సంఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదు. ఉదయం శారదమ్మ ఆమె కూతురు ఇద్దరు ఇంట్లో కొన్ని వస్తువులను వెతుకుతుండగా ఇంటి పై కప్పునుంచి పెళ్లుమని శబ్దం రావడంతో భయంతో వారు ఆరుబయటకు పరుగులు తీశారు. వెంటనే ఇంటి పై కప్పు కూలిపోయింది. ఇంట్లోని సామాన్లు, బియ్యం, ఇతరత్ర సామాగ్రి మట్టిలో కూరుకుపోయాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నానిపోయి మట్టి మిద్దె కూలినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం శారదమ్మకు నూతన గృహాన్ని మంజూరు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఈ దారుల్లో నడిచేదెలా?

- శివారు ప్రాంతాల్లో బురదలోనే రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ వాసులు



నాగప్పల కట్టనుంచి ఎంజీ వెంచర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి



హెచ్‌బీఎస్ కాలనీలో .



శిల్పా కాలనీ లో..

ఎమ్మిగనూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే శివారు కాలనీల్లోని రోడ్లుతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న రహదారులు చిత్తడి చిత్తడిగా మారుతున్నాయి. దీంతో ఆయా కాలనీల వాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా శివారు ప్రాంతాలైన రాధాకృష్ణ కాలనీలో సీసీ రోడ్లు లేకపోవటంతో మట్టిరోడ్లు గుంతలు పడ్డాయి. దీంతో వర్షం వచ్చినప్పుడంతా రోడ్లపై వర్షం నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.కాలనీలో ఓ ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రితో పాటు ఓ ఫంక్షన్ హాల్ ఉండటంతో ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. పట్టణంలోని నాగప్పల కట్టునుంచి ఎంజీ వెంచర్‌కు వెళ్లే రహదారి కొంతమేర సీసీ రోడ్డు ఉన్న చివరలో మట్టిరోడ్డు ఉండటం, ఆ రహదారిపై వాహనాలు రాకపోకలు అధికంగా వుంటంతో రోడ్డు కాస్తా గుంతల మయంగా మారి వర్షం నీరు నిలిచి చిత్తడిచిత్తడిగా మారింది. అలాగే సాయి గణేశ్ కాలనీ శివారులో కూడా మట్టిరోడ్లు ఉండటంతో బురదలో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. అన్నమయ్య సర్కిల్ నుంచి కాలనీలోకి వెళ్లేందుకు రహదారిలో నిలిచిన వర్షం నీటితో అవస్థలు పడుతూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అలాగే తిరుమల నగర్‌లో ఒకటి రెండు రోడ్లుసీసీ రోడ్లు ఉన్నా మిగతా రహదారులన్ని మట్టిరోడ్లు కావటంతో వర్షం వచ్చిందంటే బురదలో రాకపోకలు సాగించాలి. ఇక శిల్పా ఏస్టేట్‌లో వెంచరు వేసిన సమయంలో వేసిన రోడ్లు కావటంతో అవి కాస్త పాడైపోయి గుంతలు పడ్డాయి. దీంతో వర్షం వచ్చినప్పుడంతా గుంతల్లో



ఎల్లమ్మ బీడులో రామకృష్ణ స్వామి మఠం వైపు వెళ్లే రోడ్డు

వర్షం నీరు నిలుస్తున్నాయి. ఎల్లమ్మ బీడులోని మంత్రాలయం రోడ్డు నుంచి రామకృష్ణ మఠం వెళ్లే రహదారి బురదమయంగా మారింది. రోడ్డులో వర్షం నీరు నిలిచాయి. అలాగే మిలటరి కాలనీ, సాయినగర్‌లలో సైతం ఇదే పరస్థితి నెలకొంది. ఇక పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో ధ్యాన మందిరం, గాయత్రి ఆలయానికి వెళ్లే రహదారులు ఎప్పుడో ఏళ్ల క్రితం వే శారు. అవి కాస్త రాళ్లు, కంకర తేలి శిథిలావస్థకు చేరాయి. దీంతో వర్షం వచ్చిందంటే రోడ్డుపై నీరు నిలచిపోతోంది. దీంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రధాన రహదారి అయిన ట్యాంకు బండ్ రోడ్డులో వర్షం నీరు నిలుస్తోంది. డ్రైనేజీ లేకపోవటంతో వర్షం వచ్చినప్పుడల్లారోడ్డుపై నీరు నిలవాల్సిందే. అలాగే శిల్పా ఏస్టేట్ ఆర్చరి దగ్గర వర్షం నీరు నిలుస్తుండటంతో నీటిని ఎత్తిపోయాల్సిన దుస్థితి. ఇలా పట్టణ శివారు ప్రాంతాలతో పాటు పట్టణంలోని ఆయా రహదారులు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి రహదారులపై నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఈరన్న స్వామి సన్నిధిలో ఎస్పీ



ఎస్పీకి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

కౌతాళం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామిని మంగళవారం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ దర్శించుకున్నారు. వీరికి ముందుగా ఆలయ ఈవో వాణి ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి పూలమాల, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామి శ్రావణ మాసపు ఏర్పాట్లపై ఆలయ ఈఓ వాణిని అడిగి తెలుసుకున్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ: స్వామి దర్శనం అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మండల కేంద్రమైన కౌతాళం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో పోలీసింగ్ వ్యవస్థను పటిష్ఠ పరచాలని స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా భరోసా కల్పించాలని తెలిపారు. వీరి వెంట కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఉన్నారు.

అన్నదానానికి విరాళం అందజేత: ఈరన్న స్వామి వారికి భక్తులు శ్రావణ మాసంలో భాగంగా మంగళవారం దేవాలయంలో చేపడుతున్న శాశ్వత అన్నదాన పథకానికి బెంగళూరు వాస్తవ్యులు ప్రగతి, ఖ్యాతి కుటుంబ సభ్యులు రూ.50,000ల నగదును, ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి ఈ నగదును విరాళంగా ఆలయ కార్యాలయం నందు అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈఓ వాణి తెలిపారు ఆలయ సిబ్బంది మల్లికార్జున, కిరణ్ ఉన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడనున్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా బుధవారం 3.9 మి.మీ వర్షపాతం, గురువారం 10మి.మీ వర్షపాతం, శుక్రవారం 20 మి.మీ వర్షపాతం, శనివారం 6.6మి.మీ వర్షపాతం, ఆదివారం 3 మి.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 30.2-32.1 డిగ్రీల సెల్సీయస్, కనిష్ట ఉష్ణోగ్రత 22.8-23.4 డిగ్రీల సెల్సీయస్ ఉంటుందన్నారు. పశ్చిమ నుంచి వాయువ్య దిశగా గాలులు గంటకు 12-16కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

బైక్‌ల చోరీ

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్ఎస్ నగర్‌కు చెందిన మాబాషా బైక్‌ను సోమేశ్వర సర్కిల్‌లో పార్కింగ్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని, మునెప్ప నగర్ నివాసి చంద్రశేఖర్ బైక్‌ను సోమప్ప సర్కిల్ లో పార్కింగ్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు.

అంధకార సమాజానికి దివిటీలు విద్యార్థులే..



జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ మాజీ సహాయ కార్యదర్శి శ్రీనివాసనాయుడు



గోనెగండ్లలో ఏఐఎస్ఎఫ్ గురించి వివరిస్తున్న సీపీఐ జిల్లా సమితి మాజీ సభ్యుడు మద్దిలేటి నాయుడు

సమాజాన్ని అంధకారం నుంచి కాపాడగలిగే దివిటీలు విద్యార్థులే అని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉద్ఘాటించారు. మంళవారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థి నాయకులు అన్ని మండలాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజానికి, దేశానికి ఉపయోగపడేలా ఎదగాలని ఏఐఎస్ఎఫ్ మాజీ సహాయ కార్యదర్శి శ్రీనివాసనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక బాలుర జూనియర్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర, సమీఉల్లాల ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ మాజీ సహాయ కార్యదర్శి శ్రీనివాసనాయుడు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విష్ణు, అబ్దుల్, ఖాదర్, రవి, దస్తగిరి, సమీర్, వలి, శంకర్, బాబు, వీరేష్, సంతోష్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సీపీఐ జిల్లా సమితి మాజీ సభ్యులు మద్దిలేటి నాయుడు, ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని మద్దిలేటి నాయుడు, ఏఐఎస్ఎఫ్ సీనియర్ నాయకుడు గానుగ బాషా, గౌస్, మాలిక్‌బాషా, ఖాసీంవలి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షుడు మునిస్వామి, సమీర్, అన్సర్, ప్రభాకర్, జలీల్, కాశీం పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రమైన నందవరంలో ఏఐఎస్ఎఫ్ 90వ అవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహయ కార్యదర్శి విజయేంద్ర, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు పంపన్నగౌడు జెండా అవిష్కరించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఏఐఎస్ఎఫ్ నిర్మాణాత్మకమైన పాత్ర పోషించిందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు హజీ బాబావలీ, భీమశేఖర్, వీరేష్, నూరి, లోకేష్, రవి పాల్గొన్నారు.

మంత్రాలయం: నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేసి.. 'చదువుతూ పోరాడు' అనే నినాదంతో పార్టీ ఆవిర్భవించిందన్నారు. పేద విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం, స్కాలర్‌షిప్పుల మంజూరు, మౌలిక వసతుల కల్పన కోసం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేష్ , నవీన్, నరేందర్, వలి, రాజు ప్రహ్లేద్ పాల్గొన్నారు.

వాహనాల వేలం

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను ఎక్సైజ్ స్టేషన్‌లో మంగళవారం వేలం వేశారు. సీ ఐ రమేష్‌రెడి తెలిపిన వివరాల మేరకు స్థానిక ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో డిప్యూటి కమిషనర్ రామకృష్ణా రెడ్డి అధ్వర్యంలో 25 బైక్‌లు అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను బహిరంగా వేలంకు పిలవగా అసక్తి ఉన్నటువంటి కొనుగోలుదారులు వేలంలో పాల్గొన్ని వాహనాలను దక్కించుకొన్నారు. మొత్తం 25 వాహనాలను వేలంలో పెట్టగా 22 వాహనాలను వేలంలో కొనుగోలుదారులు దక్కించుకున్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి రూ 3,20,370లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఇస్మాయిల్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బృందం వివరాలు వెల్లడి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై గత నెల రోజుల పాటు సామాజిక తనిఖీ బృందం పనులను పరిశీలించింది. జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం పనులను పరిశీలించి వివరాలను సేకరించింది. మండలంలో మొత్తం 16 జీపీల్లో జరిగిన చెక్‌డ్యాంలు, ఫారంపండ్లు, ఫీడర్ చానల్, ఫీల్డ్‌చానల్, హార్టికల్చర్, మినీగోకులాలు, సీసీ రోడ్లు వంటి వివిధ రకాల పనులను విచారణ చేపట్టింది. ఈ పనుల్లో ఎక్కడెక్కడ పనులు జరిగాయి, ఎంత నిధులను వెచ్చించారు వివరాలను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనం ముందు బహిరంగంగా వెల్లడిస్తున్నట్లు ఏపీవో విజయ్‌మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రజలు, ఎన్ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

నులిపురుగుల నివారణపై అవగాహన కలిగి ఉండాలి



పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది



అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమనంతన్‌రావు



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న డాక్టర్

పెద్దకడబూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని మంగళవారం డాక్టర్ కేజియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంవత్సరం వయస్సు నుంచి 19 ఏళ్ల ఉన్న బాల, బాలికలకు ఆల్‌బెండోజోల్ మాత్రలు వేయించాలన్నారు. ఆల్‌బెండోజోల్ మాత్రలు వాడడం వల్ల శరీరంలో రక్తహీనత తగ్గడంతోపాటు పోషకాహార సంగ్రహనం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఆదినారాయణ, సూపర్‌వైజర్ కిశోర్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గోనెగండ్ల: విద్యార్థులు తప్పని సరిగా నులిపురుగుల నివారణ మందులను వేసుకొని ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని రాష్ట్ర వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమనంతన్‌రావు, జిల్లా మలేరియా అధికారి నూకరాజు కోరారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వారు జిల్లాలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అందులో భాగంగా మండల కేంద్రమైన గోనెగండ్లలోని పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు రంగావరళి, మేర్సిగోల్డ్, పరమేశ్వరప్ప సిబ్బంది ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: విద్యార్థులు శుభ్రతను పాటించాలని డాక్టర్ సాయికిరణ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మాచ్‌మాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలను వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అన్నం తినే సమయంలో చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. దాదాపు 30 సెకన్ల పాటు చేతులను రుద్ది కడుక్కోవాలన్నారు. అపరిశుభ్రంగా భోజనం చేయడం వల్ల అనారోగ్యాల పాలవుతారన్నారు ఏడాది సంవత్సరం ఉన్న చిన్నారి నుంచి 19ఏళ్ల బాల, బాలికలందరు ఆల్బెండోజోల్ మాత్రలను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతిరాజు, ఉపాధ్యాయులు ఇందిరా, అపర్ణలత, ఆశావర్కర్ శ్రీదేవి పాల్గొన్నారు.